మీరు నవ్వినట్లు ఎప్పుడూ చూడలేదు
మహిళా జర్నలిస్ట్‌తో ట్రంప్




2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 5 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 33 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


ఫైనల్స్‌లో @ అండర్ 19



8

## లండన్, దోహాలో మంత్రి బృందం పర్యటన

**అమరావతిలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, టూరిజం ప్రాజెక్టుల నిర్మాణం కోసం విదేశీ పర్యటన**

- స్పోర్ట్స్ సిటీలు,రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు అధ్యయనం చేసిన మంత్రి బృందం
- దోహా స్పోర్ట్స్ సిటీ తరహాలో అమరావతి స్పోర్ట్స్ సిటీలో పలు ప్రాజెక్టుల నిర్మాణం
- థేమ్స్ నది రివర్ ఫ్రంట్ తరహాలో కృష్ణా రివర్ ఫ్రంట్ అభివృద్ధి కి ప్రణాళికలు



**అమరావతి, ఫిబ్రవరి 4:** అమరావతిలో నిర్మించే పలు ప్రాజెక్టుల అధ్యయనానికి విదేశీ పర్యటనకు వెళ్ళారు మంత్రి నారాయణ..ప్రజా రాజధాని అమరావతిని ప్రపంచంలో టాప్ 5 రాజధానులలో ఒకటిగా నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెబుతున్నారు..దానికి తగినట్లుగానే మాస్టర్ ప్లాన్ రూపకల్పన తో పాటు కీలక ప్రాజెక్టుల నిర్మాణం కోసం అనేక దేశాల్లో అధ్యయనం చేస్తున్నారు...దీనికోసం మంత్రి నారాయణ తో పాటు

...మిగతా 2లో

## సుపరిపాలనను తట్టుకోలేకే.. జగన్ కుట్రలు

ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు

2



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక భేటీ

# రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది.. సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశం కానున్నారు... తాజా రాజకీయ పరిణామంతో పాటు తిరుపతి లడ్డూ అంశం ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. దీంతోపాటు రాజ్యసభ స్థానాల అంశానికి సంబంధించి కూడా చర్చకు రానున్నట్టు సమాచారం.. చంద్రబాబుతో పవన్ కల్యాణ్ ఇవాళ ఉదయం 10.40కి సమావేశం కానున్నారు. హైదరాబాద్ నుంచి పవన్ కల్యాణ్ ఇవాళ ఉదయం అమరావతికి రానున్నారు.. ఉదయం 10.40 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ సమావేశం జరగనుంది. ప్రధానంగా కేబినెట్‌లో చర్చించిన తిరుమల లడ్డూ అంశానికి సంబంధించి సిట్ నివేదిక.. అదేవిధంగా ఇతర అంశాలకు సంబంధించి ప్రధానంగా చర్చ జరగనుంది.

రాష్ట్రంలో తిరుమల లడ్డూ అంశానికి సంబంధించి గత నాలుగు రోజులుగా... వైసీపీ, టీడీపీ మధ్య మాటల యుద్ధం జరుగుతోంది.. రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు కూడా ఉన్నాయి.. ఈ విషయాలు అన్నింటి మీద కూడా చర్చ జరగనుంది. కూటమి నేతలు మంత్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల మీద కూడా ప్రధానంగా చర్చిస్తారు.. టీటీడీ తిరుమల తిరుపతి లడ్డూ అంశానికి సంబంధించి ప్రధానంగా టీడీపీ ఒక్కటే ఇప్పటి వరకు ప్రత్యక్ష ఆందోళనలో ఉంది.. దీంతోపాటు కూటమి మొత్తం కలిసి వస్తే గనుక తీవ్రత కొంచెం పెంచినట్టు అవుతుందని నిన్న సీఎంతో జరిగిన సమావేశంలో

...మిగతా 2లో

త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. వీటికి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి అనే దాని మీద కూడా ప్రత్యేకించి చర్చించే అవకాశం ఉంది.. కూటమిలో నాలుగు స్థానాలు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి.. కాబట్టి కూటమిలో టీడీపీకి రెండు, జనసేనకి ఒకటి, బీజేపీకి ఒకటి వచ్చే అవకాశం ఉంది.



## తెలంగాణలో మున్సిపోల్స్‌కి పవన్ ప్రచారం

**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం చేయనున్నారు. ఈ నెల 7, 8వ తేదీల్లో ప్రచారం చేసేందుకు రానున్నారు. ఈ మేరకు జనసేన కేంద్ర కార్యాలయం వెల్లడించింది. భాజపా, జనసేన అభ్యర్థుల తరఫున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ తెలిపింది. పవన్ ఎన్నికల ప్రచార షెడ్యూల్, రూట్ మ్యాప్‌ను త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.

## తిరుమల వ్యవహారంలో త్వరలో సిట్ పూర్తినివేదిక

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్



**విజయవాడ, ఫిబ్రవరి 4(మనంన్యూస్):** తిరుమల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ పూర్తి స్థాయి నివేదిక త్వరలో రాబోతుంది. దీనిపై తప్పనిసరిగా పెద్ద ఎత్తున విచారణ జరిగి ఎవరైతే అక్రమార్కులు ఉన్నారో అందరినీ అరెస్ట్ చేయడం జరుగుతుంది. ఇప్పటికే చాలా మందిని సస్పెండ్ చేశారు. ఎవరైతే దోషులు ఉన్నారో వాళ్ళందరినీ నిగ్గదీసి-అలాగే దోషులని ప్రోత్సహించిన వ్యక్తులు ఎవరైతే ఉన్నారో వాళ్ళని కూడా తప్పనిసరిగా అరెస్ట్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగింది. మరొకసారి ఇలాంటివి పునరావృత్తం కాకుండా ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, పవిత్రతను భంగం కలిగించే ఎటువంటి చర్యను కూడా ఉపేక్షించేది లేదని నిర్ణయించడం జరిగింది. ఏ విధమైన రక్షణ కవచాలు అవలంబించాలి... ఏ విధంగా నియమ

...మిగతా 2లో

## గత వైసీపీ ప్రభుత్వంపై మండిపడిన మంత్రి

**విజయవాడ, ఫిబ్రవరి 4(మనంన్యూస్):** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిని కల్తీ చేయడం ద్వారా కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. అనకాపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకోవడమే కాకుండా, పవిత్రమైన దేవదేవుడి ప్రసాదాన్ని కూడా వదలలేదని ధ్వజమెత్తారు. దర్యాప్తు సంస్థలు కల్తీ జరిగినట్లు స్పష్టమైన ఆధారాలతో నివేదికలు సమర్పించినా వైసీపీ నేతలు సిగ్గులేకుండా బుకాయిస్తున్నారని మంత్రి విమర్శించారు.



**ప్రమాదకర రసాయనాలతో నెయ్యి**

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ నివేదికలోని అంశాలను మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో సుమారు 60 లక్షల కిలోల నెయ్యిని

...మిగతా 2లో

## సనాతన ధర్మాన్ని నవతరానికి అందించాలి



3

## అది కాంట్రాక్టర్ల జేబులు నింపే పథకం: వైఎస్ షర్మిల



**విజయవాడ, ఫిబ్రవరి 4(మనంన్యూస్):** శ్రీ సత్యసాయి జిల్లాలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి చేపట్టిన 'మన్రేగా పరిరక్షణ యాత్ర' మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గంలోని రాఘవంపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో ఆమె స్వయంగా పాల్గొన్నారు. కూలీలతో కలిసి పలుగు, పార పట్టి మట్టి ఎత్తి పని చేశారు. అనంతరం స్థానిక కూలీలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరుగారుస్తోందని, దీనిపై ప్రజలు గళమెత్తాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పేదల ఆకలి తీర్చడానికి 'కరువు పని'గా ఈ పథకం మొదలైందన్నారు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో అద్భుతంగా

...మిగతా 2లో

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్

2

## న్యాయవాది దారుణ హత్య



**మొయినాబాద్, ఫిబ్రవరి 4:** రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సొంత అన్న చేతిలో మహిళా న్యాయవాది స్వప్న (34) హత్యకు గురయ్యారు. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల కోర్టులో స్వప్న న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె కుటుంబంలో ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం

...మిగతా 2లో

## ఎప్‌స్టీన్ ఫైల్స్ విచారణకు హాజరవుతాం

### క్లింటన్ దంపతుల వెల్లడి




**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** లైంగిక నేరగాడిగా అపఖ్యాతి మూటగట్టుకోవడంతో పాటు అంతర్జాతీయ గూఢచారిగా పనిచేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్న జెఫ్రీ ఎప్‌స్టీన్ వ్యవహారంపై విచారణ

...మిగతా 2లో

## అడవిలో బందీల విముక్తి ఆపరేషన్ విన్యాసం నిర్వహణ



5




## జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

**జమ్ము, ఫిబ్రవరి 4:** జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వారు జైషే మహ్మద్‌కు చెందినవారుగా గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జైషేకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులకు సంబంధించి నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. అనంతరం మిలిటెంట్లు పారిపోయారు. ఉదంపూర్ ప్రాంతంలోని గుహల్లో వారు ఉన్నట్టు సమాచారం అందడంతో మళ్లీ

...మిగతా 2లో

## గడాఫీ కుమారుడి హత్య



**ట్రిపోలీ(లిబియా), ఫిబ్రవరి 4:** లిబియా ఒకప్పటి నియంత దివంగత గడాఫీ కుమారుడు సయిఫ్ అల్ ఇస్లాం (53) హత్యకు గురయ్యారు. సాయుధ దుండగుల కాల్పుల్లో మరణించారని ఆయన బృందంలోని ఒకరు పేర్కొన్నారు. సయిఫ్ సలహాదారుడు మీడియాతో మాట్లాడుతూ..

...మిగతా 2లో



# 'న్యూ స్టార్ట్'కు ది ఎండ్

## నేటితో ముగిసిన అమెరికా-రష్యా అణుఒప్పందం

### ముందుకొస్తే కొనసాగిస్తామన్న పుతిన్ • స్పందించని అగ్రరాజ్యం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** అమెరికా-రష్యా అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం ఫిబ్రవరి 5తో ముగియనుంది. దీంతో అణ్వాయుధ నిల్వలపై ఉన్న పరిమితులు తొలగిపోనున్నాయి. ఈ ఒప్పందం ముగింపు అనేది అణ్వాయుధ పోటీకి దారితీయొచ్చనే భయాలు మొదలవుతున్నాయి. అయితే, అమెరికా ఈ ఒప్పందాన్ని కొనసాగించేందుకు ముందుకొస్తే.. తాము కూడా మరో ఏడాది పాటు దీనికి కట్టుబడి ఉంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల ప్రకటించారు. కానీ, ట్రంప్ యంత్రాంగం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు. దీనిపై సరైన సమయంలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ వర్గాలు ప్రకటించాయి.

**నాటి ఒప్పందం..:** అణ్వాయుధ నిల్వలకు సంబంధించి 1972లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్,

...మిగతా 2లో

# రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం

(మొదటి పేజీ తరువాయి)

చర్చకి వచ్చింది.. ఆ దిశగా చర్చ జరగనుంది. మూడు పార్టీలు కలిసి అందులో ప్రధానంగా జనసేన కూడా ఉంది కాబట్టి ఉమ్మడి కార్యాచరణతో ముందుకు వెళ్లే విధంగా సీఎం.. డిప్యూటీ సీఎం మధ్య చర్చ జరిగే అవకాశం ఉంది...

త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. వీటికి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి అనే దాని మీద కూడా ప్రత్యేకించి చర్చించే అవకాశం ఉంది.. కూటమిలో నాలుగు స్థానాలు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి.. కాబట్టి కూటమిలో టీడీపీకి రెండు, జనసేనకి ఒకటి, బీజేపీకి ఒకటి వచ్చే అవకాశం ఉంది.. కాబట్టి ఆ దిశగా కూడా చర్చించే అవకాశం కనిపిస్తోంది... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఇతర అంశాలకు సంబంధించి కూడా ప్రధానంగా చర్చిస్తారు... త్వరలో మంత్రి మండలి విస్తరణ జరగచ్చని సమాచారం.. ఈ అంశం కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇవాళ గుంటూరు జిల్లా పర్యటనకు వెళ్తున్నారు. అంబటి రాంబాబు నివాసంలో. జరిగిన దాడికి సంబంధించి జగన్మోహన్ రెడ్డి గుంటూరు పర్యటన చేస్తూ ఉన్నారు. దీంతో గుంటూరు జగన్మోహన్ రెడ్డి పర్యటన విషయానికి సంబంధించి కూడా ప్రధానంగా వీరిద్దరి మధ్య చర్చకి వచ్చే అవకాశం ఉంది... అవసరం అయితే జిల్లా పర్యటనలు పవన్ చేసే విధంగా కార్యాచరణపై చర్చించే అవకాశం ఉంది.. అంటే రాబోయే రోజుల్లో జగన్ తీసుకునే స్టాండ్ ఎలా ఉండనుంది..

అవసరమైతే పవన్ కల్యాణ్ కూడా జిల్లా పర్యటన చేయాలా లేకపోతే ఉమ్మడిగా కూటమి... పోరాటాలు.. చెయ్యాలా అనే అంశం పై... ప్రధానంగా చర్చకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.. ఓవరాల్ గా నిన్న కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొంతమంది మంత్రులు కలిసి మాట్లాడుకున్నారు.

# లండన్, దోహాలో మంత్రి బృందం పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు పలు దేశాల్లో ప్రపంచ ప్రఖ్యాత ప్రాజెక్టులను,ప్రాంతాలను పరిశీలించి బెస్ట్ మోడల్స్ ను పరిగణనలోకి తీసుకుంటున్నారు.తాజాగా అమరావతిలో నిర్మించే ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ,టూరిజం ప్రాజెక్టుల అధ్యయనానికి యూకేలోని లండన్,ఖతార్ రాజధాని దోహాలో పర్యటించారు మంత్రి నారాయణ...ఈ పర్యటనలో మంత్రి నారాయణ వెంట మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్,అమరావతి గ్రోత్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ కూడా ఉన్నారు...

రెండు రోజులపాటు లండన్ లో పర్యటించిన మంత్రి నారాయణ బృందం...సిటీ ఆఫ్ లండన్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమై లండన్ అభివృద్ధి ప్రణాళికలు,టూరిజం ప్రాజెక్టులపై చర్చించారు.. థేమ్స్ నది ఒడ్డున అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన రివర్ ఫ్రంట్ ను పరిశీలించారు...కృష్ణా నదీ తీరాన రివర్ ఫ్రంట్ అభివృద్ధి కి థేమ్స్ రివర్ ఫ్రంట్ ను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి నారాయణ అభిప్రాయపడ్డారు.

లండన్ లోని బాటర్సీ పవర్ స్టేషన్ ను సందర్శించారు...ఆ తర్వాత ప్రపంచంలోనే ఎత్తైన కాంతిలివర్డ్ అబ్జర్వేషన్ వీల్ అయిన లండన్ ఐ ను అధ్యయనం చేశారు...ఇప్పటికే అమరావతిలో లండన్ ఐ తరహాలో ఒక భారీ వీల్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇక రెండో రోజు లండన్ స్ట్రాట్ ఫోర్డ్ లోని క్వీన్ ఎలిజబెత్ ఒలింపిక్ పార్క్ ను మంత్రి నారాయణ బృందం పరిశీలించింది...2012 లో ఒలింపిక్ గేమ్స్ కోసం నిర్మించిన ఈ స్పోర్ట్స్ పార్క్ లోని పలు క్రీడా పార్కులు(ప్లే జోన్స్)ను పరిశీలించి వాటి నిర్మాణం గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు..ప్రసిద్ధ లండన్ స్టేడియం,లండన్ ఆక్వాటిక్స్ సెంటర్,హైడ్ పార్క్, లీ వ్యాలీ వేలోపార్క్ ల నిర్మాణాలను సందర్శించి వాటిని అధ్యయనం చేశారు. రెండు రోజుల పర్యటన తర్వాత లండన్ నుంచి నేరుగా ఖతార్ రాజధాని దోహా కు చేరుకున్న మంత్రి నారాయణ బృందం...అక్కడి స్పోర్ట్స్ ప్రాజెక్టులను సందర్శించింది.ఆస్పైర్ జోన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ గా పిలిచే దోహా స్పోర్ట్స్ సిటీని మంత్రి బృందం సందర్శించింది.స్పోర్ట్స్ సిటీలోని ఖలీఫా ఇంటర్నేషనల్ స్టేడియం,ఆస్పిటర్ స్పోర్ట్స్ హాస్పిటల్,ఆస్పైర్ అకాడమీలను పరిశీలించి వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు...వివిధ రకాల స్పోర్ట్స్ కాంప్లెక్స్ లతో అంతర్జాతీయ క్రీడలకు గమ్య స్థానంగా దోహా స్పోర్ట్స్ సిటీ పేరుగాంచింది..250 హెక్టార్ల లో భారీ విస్తీర్ణంలో ఉన్న స్పోర్ట్స్ సిటీలో 2006 లో ఆసియన్ గేమ్స్ నిర్వహించారు...ఇదే స్పోర్ట్స్ సిటీలో ఆసియా లోనే మొదటి స్పోర్ట్స్ మెడిసిన్ హాస్పిటల్ గా ఉన్న ఆస్పిటర్ స్పోర్ట్స్ హాస్పిటల్ కూడా ఉంది..అలాగే 2022 ఫిఫా వరల్ కప్ నిర్వహించిన లుసైల్ స్టేడియం ను సందర్శించి అంతర్జాతీయ క్రీడలను ఏ విధంగా నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు.అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికల గురించి దోహా అధికారులతో మంత్రి నారాయణ బృందం చర్చించింది.

త్వరలోనే అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మించేందుకు మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేస్తుంది ప్రభుత్వం..లండన్,దోహా ల పర్యటన తర్వాత అక్కడ అభివృద్ధి చేసిన కొన్ని ప్రాజెక్టులను అమరావతిలో కూడా అమలు చేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది.మూడు రోజుల పర్యటన ముగించుకుని భారత కాలమానం ప్రకారం గురువారం ఉదయం మంత్రి నారాయణ బృందం విజయవాడ చేరుకోనుంది.

## సుపరిపాలనను తట్టుకోలేకే.. జగన్ కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అలజడి సృష్టిందుకే ఆయన కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శ నేపథ్యంలో గుంటూరులో నెలకొన్న పరిస్థితులపై అనగాని సత్యప్రసాద్ స్పందించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని, అది చూసి తట్టుకోలేకపోతున్నారని మంత్రి అనగాని మండిపడ్డారు. అందుకే దండయాత్రలకు తన పార్టీ కార్యకర్తలను ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. సింగయ్య కుటుంబాన్ని జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. కుల మతాల మధ్య చిచ్చుపెట్టే వారిని జగన్ ప్రోత్సహిస్తున్నారని ఆరోపంచారు. సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు అసభ్యాలు చేస్తే.. ఆయన్ను జగన్ వెనుకేసుకొస్తున్నారని మంత్రి అనగాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తిరుమల వ్యవహారంలో త్వరలో సిట్ పూర్తినివేదిక

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలు పెట్టాలి అనే విషయం కూడా కూటమి నేతలు కలిసి చర్చించడం జరుగుతుంది. తప్పనిసరిగా తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు అన్ని దేవాలయాలు సంబంధించిన వాటి వ్యవహారాలు వాటి పూజ.. వాటిలో ఎక్కడా భగ్నం కలిగించకుండా..

ఆగమం ప్రకారం అన్నీ నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది. ఆ విధంగానే ముందుకు వెళ్తాం.

# గత వైసీపీ ప్రభుత్వంపై మండిపడిన మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

భోలే బాబా, వైష్ణవి వంటి సంస్థలు సరఫరా చేశాయన్నారు. అయితే అందులో అసలు నెయ్యే లేదని దర్యాప్తులో తేలిందని వెల్లడించారు. సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ నివేదిక ప్రకారం.. పామాయిల్, లాక్టిక్ యాసిడ్, మోనో లాక్టిక్ యాసిడ్ వంటి ప్రమాదకర రసాయనాలను కలిపి కత్రిమ నెయ్యిని తయారు చేసి పంపిణీ చేసినట్లు పరిశోధనలో స్పష్టమైందని ఆయన తెలిపారు. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం టెండర్ నిబంధనలను సవరించారన్నారు. అనర్హులైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టారని విమర్శించారు.

### హవాలా మార్గంలో నగదు బదిలీ

ఈ భారీ కుంభకోణంలో అప్పటి టీటీడీ ఉన్నతాధికారులు, పాలకవర్గ సభ్యుల పాత్రపై కూడా మంత్రి ఘాటుగా స్పందించారు. అప్పటి ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డి, చైర్మన్ పీఏలు ప్రధాన కారకులుగా నివేదికలో ఉన్నారని పేర్కొన్నారు. కిలో నెయ్యికి రూ.25 చొప్పున కమీషన్లు వసూలు చేశారన్నారు. హవాలా మార్గంలో కూడా నగదు బదిలీ జరిగిందని ఆధారాలు ఉన్నాయని వివరించారు. ఈ మొత్తం ప్రక్రియలో జగన్ రెడ్డి అండదండలు ఉన్నాయని ఆరోపించారు. హిందూ ధర్మంపై గౌరవం లేని వ్యక్తులు వ్యవస్థలను నాశనం చేశారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రామతీర్థం, అంతర్వేది, విజయవాడ దుర్గమ్మ గుడి వంటి చోట్ల జరిగిన అపచారాలను ఆయన గుర్తు చేశారు.

### డిక్లరేషన్ విషయంలో మొండితనం

శ్రీవారి దర్శనానికి వెళ్లే సమయంలో అన్యమతస్థులు ఇచ్చే డిక్లరేషన్ విషయంలోనూ జగన్ రెడ్డి మొండిగా వ్యవహరించారని కొల్లు రవీంద్ర విమర్శించారు.

మాజీ రాష్ట్రపతులు, ప్రధానులు కూడా పాటించిన నిబంధనలను జగన్ ధిక్కరించడం ఆయన అహంకారానికి నిదర్శనమని అన్నారు.

ఇప్పుడు తప్పు దొరికిపోయినా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తూ భక్తులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమలకు మద్యం సీసాలు తీసుకురావడం వంటి చర్యల వెనుక వైసీపీ నేతల కుట్రలు ఉన్నాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

### చట్టం నుంచి తప్పించుకోలేరు

చివరగా దేవుడి విషయంలో ఆటలాడుకున్న వారు ఎవరైనా సరే చట్టం నుంచి తప్పించుకోలేరని మంత్రి హెచ్చరించారు. ఈ కల్తీ కుట్రలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు రాష్ట్రంలోని అన్ని ఆలయాల పవిత్రతను కాపాడటానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, దోషులను బోనులో నిలబెట్టే వరకు విశ్రమించబోమని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# అది కాంట్రాక్టర్ల జేబులు నింపే పథకం: వైఎస్ షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

అమలు జరిగిందని గుర్తు చేశారు. అయితే ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి గ్రహణం పట్టిందని ధ్వజమెత్తారు. మన్రేగాను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే కొత్తగా విబి గ్రామ్ జి అనే చట్టాన్ని తీసుకువచ్చారని ఆమె విమర్శించారు. ఈ కొత్త చట్టం వల్ల రాష్ట్రాలపై 40 శాతం ఆర్థిక భారం పడుతుందని, ఇది పేదల పొట్ట కొట్టే చర్య అని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న 125 రోజుల పని అనేది ఒక పచ్చి మోసం అని షర్మిల విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 100 రోజుల పనిని ఒక హక్కుగా కల్పించాం. కానీ బీజేపీ హయాంలో సగటున 52 రోజులు కూడా పని ఇవ్వలేకపోయారు. 100 రోజులే సరిగ్గా ఇవ్వలేని వారు, ఇప్పుడు 125 రోజులు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదం అని ఆమె ఎద్దేవా చేశారు. మన్రేగా కింద రోజుకు 7 గంటలు పని చేస్తే సరిపోయేదని, కానీ కొత్త చట్టం ప్రకారం 125 రోజుల పేరుతో 12 గంటలు పని చేయించుకోవాలని చూస్తున్నారని, ఇది కూలీలను శ్రమదోపిడీ చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పథకంలో గ్రామసభల ద్వారా పనులు నిర్ణయించే ప్రజాస్వామ్య పద్ధతిని తీసేశారన్నారు.

ఇప్పుడు ఢిల్లీ నుంచి కేంద్రమే నిర్ణయించేలా మార్పులు తెచ్చారని ఆమె ఆరోపించారు. ఏ గ్రామంలో ఏ పని కావాలో కేంద్రానికి ఏం తెలుసు? అని ప్రశ్నించారు. ఇదంతా బీజేపీకి అనుకూలమైన కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకేనని విమర్శించారు. కూలీలకు ఉపాధి కల్పించే పథకాన్ని కాంట్రాక్టర్లకు లేబర్ సప్లై చేసే ఏజెన్సీగా మార్చేశారని దుయ్యబట్టారు. గతంలో వైఎస్సార్ హయాంలో పని అడిగిన 15 రోజుల్లోనే పని కల్పించేవారని పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు ఉండేవని, ఇప్పుడు మంచినీరు కూడా దొరకని పరిస్థితి నెలకొందన్నారు.

# న్యాయవాది దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం పొలం వద్ద పంచాయతీ జరుగుతుండగా.. స్వప్నను సోదరుడు రాజు హతమార్చాడు. హత్య సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు.. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### రాజు మూడేళ్లుగా పథకం పన్నాడు: తల్లి వెంకటమ్మ

స్వప్నను చంపాలని రాజు మూడేళ్లుగా పథకం పన్నాడని తల్లి వెంకటమ్మ అన్నారు. హతమార్చేందుకు ఇప్పటికే రెండుసార్లు యత్నించాడని చెప్పారు. భూమి సర్వే అనంతరం తిరిగి వెళ్తుండగా స్వప్నపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని తెలిపారు. కర్రలు, కత్తులతో దాడి చేశారని.. రాజుతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని వెంకటమ్మ కోరారు.

# ఎప్స్టీన్ ఫైల్స్ విచారణకు హాజరవుతాం

(మొదటి పేజీ తరువాయి)

మరో మలుపు తిరిగింది. అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) ఓవ్సైట్ కమిటీ ముందు హాజరై వాంగ్మూలం ఇవ్వడానికి మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఆయన భార్య హిల్లరీ క్లింటన్‌లు అంగీకరించారు. ఈ విషయాన్ని తమ న్యాయవాదుల ద్వారా కమిటీకి తెలియజేశారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన జేమ్స్ కోమర్ కాంగ్రెస్ హౌస్ ఓవ్సైట్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇంతకు ముందు క్లింటన్ దంపతులు వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరించడంతో వారిపై ధిక్కార చర్యలు చేపడతామని కమిటీ ఛైర్మన్ హెచ్చరించారు. ధిక్కార నేరం రుజువైతే భారీ జరిమానా చెల్లించడంతో పాటు కారాగార శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుంది. క్లింటన్ దంపతులపై అటువంటి చర్యలు తీసుకోవద్దని వారి తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు.

### బ్రిటిష్ ఎంపీ రాజీనామా

మరోవైపు ఎప్స్టీన్‌తో దగ్గర సంబంధాలున్న వ్యక్తిగా పేరుబడ్డ ప్రముఖ బ్రిటిష్ రాజకీయ నాయకుడు పీటర్ మండెల్సన్ బ్రిటన్ పార్లమెంటు ఎగువసభ శాశ్వత సభ్యత్వం నుంచి నిష్క్రమించనున్నట్టు ప్రకటించారు. ఎప్స్టీన్‌తో సాన్నిహిత్యం కలిగివున్న మండెల్సన్‌ను సభ్యత్వం నుంచి తొలగించేందుకు ప్రభుత్వం చట్టాన్ని తేవాలని యోచిస్తున్న తరుణంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా విడుదలైన ఎప్స్టీన్ ఫైల్స్‌లో వెల్లడైన వివరాలు తనను ఆశ్చర్యానికి గురిచేశాయని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అన్నారు. ఈ ఉదంతంలో అమెరికా ప్రభుత్వం తాజాగా 30 లక్షల పేజీల సమాచారాన్ని విడుదల చేసిన విషయం విదితమే.

# మీరు నవ్వినట్లు ఎప్పుడూ చూడలేదు

## మహిళా జర్నలిస్ట్‌తో ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 4: అమెరికా అధ్యక్ష భవనంలోని ఓవల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సీఎన్ఎన్ ఛానల్కు చెందిన ఓ రిపోర్టర్స్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్స్టీన్ సెక్స్ కుంభకోణంలో కొత్తగా విడుదలైన పత్రాల గురించి సీఎన్ఎన్ ఛానల్‌కు చెందిన కైట్లాన్ కొల్లిన్స్ అనే రిపోర్టర్ ట్రంప్‌ను ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన అమెరికా అధ్యక్షుడు 'నువ్వో చెత్త రిపోర్టర్వి' అంటూ ఆమెను విమర్శించారు.

''నేను పదేళ్లుగా మిమ్మల్ని చూస్తున్నాను. ఇప్పటివరకు ఒక్కసారి కూడా నవ్వినట్లు చూడలేదు. మీలాంటి వాళ్ల వల్లే సీఎన్ఎన్ ఛానల్ రేటింగ్ పడిపోతుంది. మీరు ఎప్పుడూ నిజాలు చెప్పరని మీకు బాగా తెలుసు. అందుకే ఎప్పుడూ సీరియస్గా ఉంటారు. ఎప్స్టీన్ ఫైల్స్‌లో నాతో సహా ఇతరుల పేర్లను కుట్ర పూరితంగా విడుదల చేశారు. ఇప్పుడు ఇటువంటి విషయాల గురించి కాకుండా దేశం గురించి ఆలోచిస్తే అందరికీ మంచిది'' అని ట్రంప్ రిపోర్టర్ని ఉద్దేశించి అన్నారు. ఈ మీడియా సమావేశానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది.

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి అమెరికా న్యాయశాఖ ఇటీవల మరిన్ని పత్రాలను విడుదల చేసింది. అందులో మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ, బిల్ గేట్స్, పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్‌ల ప్రస్తావన, వారికి సంబంధించిన ఫొటోలు ఉన్నాయి. అయితే, అధ్యక్షుడు డొనాల్ ట్రంప్నకు సంబంధించిన ఫొటోలు మాత్రం ఎక్కడా కనిపించలేదు. దీనిపైనే తాజాగా జరిగిన విలేకరుల సమావేశంలో రిపోర్టర్ అమెరికా అధ్యక్షుడిని ప్రశ్నించారు.

# పరిశ్రమల భద్రతపై రాజీ వద్దు

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




శ్రీకాకుళం, ఫిబ్రవరి 4: జిల్లాలోని రసాయన పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు రాజీవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'జిల్లా సంక్షోభ నివారణ బృందం' సమావేశంలో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ సిఫార్సులను యుద్ధప్రతిపాదికన అమలు చేయాలన్నారు. పైడిభీమవరంలోని శ్రేయాస్ ఇండస్ట్రీస్లో ఉన్న మిథనాల్ నిల్వ సామర్థ్యాన్ని కమిటీ పరిశీలించాలన్నారు.

పరిశ్రమల్లో విష వాయువుల లీకేజీని గుర్తించేలా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిరంతరం నిఘా ఉంచాలని, అత్యవసర సమయాల్లో స్పందించేందుకు వీలుగా ఆన్-సైట్ ఎమర్జెన్సీ ప్లాన్లను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పరిశ్రమల సమీప గ్రామాల ప్రజలకు, కార్మికులకు ప్రమాదాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్లకు జిల్లా అగ్నిమాపక అధికారి ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో విశాఖపట్నం ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్స్పెక్టర్ జె.శివశంకర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ బి.రాంబాబు, డీఐసీ జనరల్ మేనేజర్ రఘునాథ్ పాల్గొన్నారు. అలాగే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ కమాండెంట్లతో పాటు అరోయాక్టివ్ ఫార్మా, శ్రేయాస్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఆప్టోరియా ఫార్మా వంటి ప్రధాన పరిశ్రమల ప్రతినిధులు, భద్రతా అధికారులు హాజరయ్యారు.

# అభివృద్ధి సంక్షేమతో కూడిన ప్రజాపాలనే నా లక్ష్యం

## ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి, ఫిబ్రవరి 4 మనం న్యూస్ః గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమంతో కూడిన ప్రజాపాలన సాగించడమే నా ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని ) అన్నారు. బుధవారం మండలంలోని రావిళ్లవారి పల్లి గ్రామంలో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మీ ఊరికి....మీ పులివర్తి నాని కార్యక్రమాన్ని అటహాసంగా ప్రారంభించారు. రావిళ్ళవారిపల్లెలో టిడిపి వ్యవస్థాపకులు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రావిళ్ళవారిపల్లి, కమ్మపల్లి, గణేశ్వర పురం గ్రామాలలో ఏర్పాటుచేసిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నానన్నారు. ఏడాదన్నర కాలంలో చంద్రగిరి నియోజకవర్గంలో అవినీతి, అరాచకాలను అరికట్టి అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు సేవలు అందిస్తున్నానని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలు చేస్తారని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని సమస్యలు లేని, అభివృద్ధిలో పరుగులు తీస్తున్న ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు తయారుచేసి నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. గ్రామాలలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు, స్మశాన వాటికలు, ఆర్వో వాటర్ ప్లాంట్ లు, మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఎమ్ ఎస్ ఎం ఈ డైరెక్టర్ ఎన్ చిన్నబాబు మాట్లాడుతూ



ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీస్తున్నదని పేర్కొన్నారు. గ్రామాలలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

మీ ఊరికి..... మీ పులివర్తి నాని కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జనార్దన్ చౌదరి, రావిళ్ల గిరి నాయుడు, రమేష్, హరి, మధు, సురేష్, మునిరత్నం నాయుడు, మాజీ సర్పంచ్ మురళి నాయుడు, జయచంద్ర నాయుడు, వసంత్ కుమార్, బాబు నాయుడు, మహేష్, బాలాజీ, సురేష్ నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# 'న్యూ స్టార్ట్'కు ది ఎండ్

(మొదటి పేజీ తరువాయి)

సోవియట్ నేత బ్రెజ్నెవ్‌ల మధ్య తొలిసారి ఒప్పందం జరిగింది. అయితే, 2001లో అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ సమయంలో అమెరికా బయటకు వచ్చింది. మళ్లీ 2010లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదెవ్‌ల మధ్య 'న్యూ స్టార్ట్' పేరుతో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం.. ఇరుదేశాలూ 700 కన్నా ఎక్కువ క్షిపణులు, యుద్ధవిమానాలపై 1550 కన్నా ఎక్కువ అణ్వస్త్రాలను వినియోగానికి సిద్ధంగా ఉంచకూడదు. ఒకరి అణు కేంద్రాలను మరొకరు తనిఖీ చేసుకోవచ్చు. అయితే, ఇది 2021లోనే ముగియాల్సి ఉన్నప్పటికీ.. ఐదేళ్లపాటు పొడిగించారు.

### విఫలమైతే విస్తరణే..!

తాజాగా అది ఫిబ్రవరి 5తో ముగియనుంది. 35 ఏళ్లలో తొలిసారి ఇలాంటి పరిస్థితి రావడంతో అణ్వాయుధాల సంఖ్యను పెంచుకునే అవకాశం లభిస్తుందనే ఆందోళన మొదలైంది. ఈ పరిస్థితి రష్యా, అమెరికా మధ్య అణ్వాయుధ పోటీకి దారితీయడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా అస్థిరత, 'అణు' ఘర్షణల ముప్పును పెంచుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఒప్పందం కొనసాగింపుపై ఇరుపక్షాలు అంగీకరించడంలో విఫలమైతే.. అణ్వాయుధ విస్తరణ భారీగా పెరిగే అవకాశం ఉందని అమెరికాలోని ఆయుధ నియంత్రణ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డారిల్ కింబాల్ పేర్కొన్నారు. అమెరికా అణు నిల్వలపై పరిమితులు లేకుంటే ప్రమాదకరమైన ప్రపంచమే అవుతుందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఇటీవల హెచ్చరించారు.

తమ జాతీయ ప్రయోజనాలను రక్షించుకునేందుకు అన్ని మార్గాలను (అణ్వాయుధాలను ఉద్దేశిస్తూ) ఉపయోగించడానికి రష్యా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్‌పై దండయాత్ర మొదలుపెట్టినప్పటి నుంచి చెబుతున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఓ ఆర్డర్‌పై 2024లో ఆయన సంతకం కూడా చేశారు. అయితే, న్యూస్టార్ట్ ఒప్పందం పరిమితులపై ఇరు పక్షాలు చర్చించేందుకు అనుగుణంగా దీనిని మరో ఏడాది పొడిగించేందుకు సిద్ధంగా ఉన్నామని పుతిన్ ప్రకటించిప్పటికీ అమెరికా నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్



కర్నూలు, ఫిబ్రవరి 04మనం న్యూస్ః పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రజలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గానికి చెందిన 5 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులు ఆయన పంపిణీ చేశారు. రాయచూరు పరశురాముడు అనే వ్యక్తికి రూ.20,933, షేక్ సాజిదా అనే మహిళకు రూ.50,800, శ్యామల దేవి అనే మహిళకు రూ.40,437, షబానా కాతూన్ అనే మహిళకు 25,655, శ్రియాన్స్ కు రూ.1,16, 255ల చెక్కులు అందించారు. మొత్తం రూ. 2,54,080 విలువ చేసే చెక్కులు బాధితులకు ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.

# ఇరుముడి ధరించి శ్రీశైలంకు బయలుదేరిన ఎమ్మెల్యే



మంత్రాలయం, ఫిబ్రవరి 2(మనం న్యూస్)ః శివమాలలో భాగంగా మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఇరుముడి ధరించి బుధవారం శ్రీశైలం కు బయలుదేరారు.

ముందుగా మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం లో ఇరుముడికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం ఆయన శిరస్సు పై ఇరుముడి ధరించారు.

ఆయనకు కొంతమంది శివస్వాములు పూలమాలలు వేసి శ్రీశైలం కు సాగనంపారు. వారితో బాల స్వాములు, ఇతర స్వాములు తదితరులు ఉన్నారు.

# సనాతన ధర్మాన్ని నవతరానికి అందించాలి

- అర్చక శిక్షణ తరగతులను ప్రారంభించిన టీటీడీ ఇంచార్జ్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి



తిరుపతి, ఫిబ్రవరి 4, మనంన్యూస్ : సనాతన ధర్మాన్ని నవతరానికి అందించాలని టిటిడి ఇంఛార్జ్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. వేలాది సంవత్సరాలుగా మన పూర్వీకులు అందించిన శాస్త్రం, సంప్రదాయాలు, సనాతన వారసత్వ సంపదకు సాంకేతికతను జోడించి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించిన అర్చక, పరిచారిక మరియు వేదపారాయణందారుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంఛార్జ్ ఈవో మాట్లాడుతూ, టీటీడీ పరిధిలోని వివిధ ఆలయాలలో విధులు నిర్వహిస్తున్న 35 మంది అర్చకులు, పరిచారకులు మరియు 15 మంది వేద పారాయణదారులకు మూడు రోజులపాటు పునశ్చరణ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్చకులు, పరిచారకులు, వేద పారాయణదారులు నిత్యం నిర్వహించే కైంకర్యాలను మరింత శుద్ధిగా, నియమబద్ధంగా నిర్వహించేందుకు ఈ పునఃశ్చరణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న కొత్త అంశాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు ఇవి దోహదపడతాయని అన్నారు. శ్రీ ఆదిశంకరాచార్యులు, శ్రీ రామానుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు వంటి మహనీయులు కాపాడుతూ వచ్చిన సనాతన సంప్రదాయాన్ని భక్తులకు, సమాజానికి చేరవేయడంలో ఈ శిక్షణ తరగతులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ఈ తరగతులలో ఆగమ పరిచయం, ఆగమాలు, వైఖానసం, నిత్య పూజ విధానం, పంచసూక్తాలు, సంధ్యావందనం, గోత్రప్రవరలు, అగ్ని ప్రతిష్టాపన, నవగ్రహోపాసనలు, అష్టోత్తర, ఆశీర్వచన మంత్రాలు, ఉచ్ఛారణ సంస్కృత పరిజ్ఞానం, కల్యాణోత్సవంలో లాజహోమ ప్రధాన హోమాలు, తిరుమల శ్రీవారి ఆలయ ఉత్సవాలు, సంప్రదాయాలు, బ్రహ్మోత్సవం, అర్చకుల లక్షణాలు, విధులు, పవిత్రోత్సవం ప్రాముఖ్యత, గృహ అర్చన, బింబ ప్రతిష్ఠ, వైశిష్ట్యం, జ్యోతిష్య శాస్త్రం, నిత్యార్చన, శిక్షణ నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం శిక్షణ తీసుకున్న వారు ఏమి నేర్చుకున్నారు, ఇంకా ఏమి నేర్చుకోవాలో తదితర అంశాలపై ఫీడ్ బ్యాక్ సేకరించి తదనుగుణంగా మాడ్యూల్స్ రూపొందించాలని సూచించారు.

అనంతరం వేద విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ, అర్చకులు, పరిచారకులు, వేద పండితులకు శిక్షణా కార్యక్రమాలు తప్పనిసరిగా నిరంతరం నిర్వహించాలన్నారు. ఈ శిక్షణల ద్వారా కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం లభించడమే కాకుండా, భిన్నమైన అభిప్రాయాల పరస్పర మార్పిడి ద్వారా నూతన ఆలోచనలు వెలుగులోకి వస్తాయని వివరించారు.

అటు తర్వాత శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రోక్త బ్రహ్మోత్సవానుక్రమణికా పుస్తకాన్ని టిటిడి ఇంఛార్జ్ ఈవో ఆవిష్కరించారు. అనంతరం మానవ నిత్య జీవితంలో వేదాల విశిష్టతను, యోగా ప్రాముఖ్యత తెల్పేలా ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని తిలకించారు. తిరుమల ఆలయ తరహాలో టిటిడిలోని అన్ని ఆలయాలలో కైంకర్యాలు నిర్వహించేందుకు వీలుగా టిటిడి ఆధ్వర్యంలోని 61 ఆలయాలలో పనిచేసే అర్చక, పరిచారిక, వేదపారాయణందారులకు ఈ శిక్షణ ఉపయోగపడనుంది.

ఈ కార్యక్రమంలో టిటిడి వైఖానస ఆగమ సలహాదారు డా. భావనారాయణ చార్యులు, ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్యం అవధాని, వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పోకల భాస్కరుడు, శ్వేత ఇంఛార్జ్ డైరెక్టర్ సువర్ణమ్మ, డిప్యూటీ ఈవో (జనరల్) ఏ. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# క్యాన్సర్ భయాన్ని విడిచిపెట్టి ముందస్తు స్క్రీనింగ్ చేయించుకోవాలి

- తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్కు పూర్తి నయం సాధ్యం
- తిరుపతిలో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి
- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి, ఫిబ్రవరి 4 మనం న్యూస్ :** క్యాన్సర్పై అనవసరమైన భయాన్ని విడిచిపెట్టి ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని, తొలిదశలోనే క్యాన్సర్ను గుర్తిస్తే పూర్తిస్థాయి నయం సాధ్యమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తిరుపతి పట్టణంలో శ్రీకాళహస్తి ఇన్స్టిట్యూట్, స్వీకార్ టాటా క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన వాకథాన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా క్యాన్సర్ కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. అయితే ముందస్తు స్క్రీనింగ్, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ను పూర్తిగా నయం చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటి సర్వేలు నిర్వహిస్తూ క్యాన్సర్కు సంబంధించిన లక్షణాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. స్క్రీనింగ్లో లక్షణాలు గుర్తించినప్పటికీ కొంతమంది భయంతో ఆసుపత్రులకు రావడం లేదని, క్యాన్సర్ విషయంలో ఎలాంటి భయం అవసరం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లాలో శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ రీసెర్చ్, స్వీకార్ టాటా క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, స్విమ్స్ వంటి అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్యాన్సర్ను స్టేజ్-1, స్టేజ్-2 దశలో గుర్తిస్తే దాదాపు వంద శాతం కోలుకునే అవకాశం ఉందన్నారు. పొగతాగడం, మద్యం సేవనం, ఊబకాయం, అసమతుల్య ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి కారణాల వల్ల క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుందని, ఇవన్నీ నివారించదగిన కారణాలేనని తెలిపారు. ముఖ్యంగా యువత చిన్న వయసులోనే పొగాకు అలవాట్లకు బానిస కావడం భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు.మలంలో రక్తస్రావం, నోటిలో గాయాలు, చర్మంపై కొత్త మచ్చలు, మహిళల్లో అసాధారణ రక్తస్రావం, బ్రెస్ట్లో గడ్డలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్పీలు, ఆశా వర్కర్లను నిర్భయంగా సంప్రదించాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెరిగినట్లే క్యాన్సర్పై కూడా సమాజంలో అవగాహన పెంచుకుంటే భయాన్ని జయించి సాధారణ జీవితం గడపవచ్చని తెలిపారు. క్యాన్సర్ అనే మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఎన్జీఓలు, రెడ్ క్రాస్ సొసైటీ, స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రులు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మారథాన్ను విజయవంతంగా నిర్వహించిన స్వీకార్ టాటా క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ మెడికల్ డైరెక్టర్ డా. ప్రశాంత్కు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులకు, వైద్య సిబ్బందికి, వాలంటీర్లకు, పాల్గొన్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

# కల్తీనెయ్యి నిందితులకు శిక్ష తప్పదు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి ఫిబ్రవరి 4 మనం న్యూస్ :** శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాల్లో వాడే నెయ్యిని కల్తీ చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆనాటి అధికారులు శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తాడేపల్లి ప్యాలెస్ కు డబ్బులు ముట్టచెప్పేందుకే కల్తీనెయ్యికి వైసిపి నాయకులు కుట్రపన్నారని ఆయన ఆరోపించారు. బుధవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో మీడియాతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడారు. గత కొన్ని నెలలుగా నడుస్తున్న కల్తీ నెయ్యి స్కాంలో అసలైన నిందితులు సిట్ పేరుతో ఎదురు దాడికి దిగుతున్నారని ఆయన విమర్శించారు. ఆనాటి సకల శాఖల మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి నెయ్యిలో కల్తీ సహజమని వ్యాఖ్యానించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎన్ డిడిబి నివేదిక మేరకు సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లు మాట్లాడారన్నారు. కానీ సిట్ పాలు, పెరుగు, వెన్న లేకుండా కేవలం రసాయనాలతో నెయ్యి చేశారని స్పష్టం చేసిందని ఆయన చెప్పారు. రసాయానాల్లో వినియోగించిన మోనోగ్లిజరైట్ కేవలం కొవ్వును రెండు వందల నుంచి రెండు వందల యాభై సెంటిగ్రేటెడ్ వద్ద వేడి చేస్తే వస్తుందని ఆయన చెప్పారు. మరి రసాయనాలు ఉపయోగించిన కల్తీ నెయ్యిలో పశువుల కొవ్వు కలిసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. కాగా సిట్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడమే కాకుండా విచారణ కమిటీ వేయనున్నట్లు ఆయన చెప్పారు. కల్తీనెయ్యి కేసుకు కారకులైన ఏ ఒక్కరు చట్టం నుంచే కాకుండా శ్రీవేంకటేశ్వర స్వామి శిక్ష నుంచి తప్పించుకోలేరని ఆయన తెలిపారు. దేవున్ని రాయి అన్న కరుణాకర్ రెడ్డి ఎన్ని అబద్దాలు చెప్పినా నిజం కావని ఆయన చెప్పారు.

**నా పేరు చెప్పి కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు**

నగరంలో తన అనుచరులు భూకబ్జాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణల్లో నిజం లేదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఎవరైనా అటువంటి ఘటనలకు పాల్పడితే పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని ఆయన చెప్పారు. అలాగే తోపుడు బండ్లు, చిరువ్యాపారుల నుంచి జనసేన నాయకులు వసూళ్ళకు పాల్పడుతున్నారని తెలిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, వెంకటేశ్వర రావు, బాబ్జీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్విమ్స్లో అన్ని దశల్లోని క్యాన్సర్లకు అత్యాధునిక వైద్య సేవలు

- టి.టి.డి. ఇన్చార్జ్ ఈ.ఓ వెంకయ్య చౌదరి




తిరుపతి, ఫిబ్రవరి 4 మనం న్యూస్ : రాయలసీమ ప్రాంత ప్రజలకు వరప్రదాయినిగా వున్న శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో క్యాన్సర్ విభాగాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి క్యాన్సర్ వ్యాధి ఏ దశలో వున్నా ఉన్నత ప్రమాణాలతో అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నారని టి.టి.డి. ఇన్చార్జ్ ఈ.ఓ. శ్రీ వెంకయ్య చౌదరి గారు కొనియాడారు. 'ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని' పురస్కరించుకుని బుధవారం స్విమ్స్లో క్యానర్సర్ పై అవగాహన ర్యాలీ, పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ, పోస్టర్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టి.టి.డి. ఇన్చార్జ్ ఈ.ఓ శ్రీ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ... స్విమ్స్లో 120 కోట్ల వ్యయంతో 300 పడకలు, 5 ఐసియూలు ఇతర అత్యాధునిక వైద్య పరికరాలతో అడ్వాన్స్డ్ క్యాన్సర్ కేర్ భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. క్యాన్సర్ ప్రారంభ దశ నుండి చివరి దశ వరకు వున్న రోగులకు సమర్ధవంతమైన వైద్యసేవలు అందించేందుకు నిపుణులైన వైద్య బృందం స్విమ్స్లో వున్నారని చెప్పారు. రెండు పింక్ బస్సుల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు అందిస్తున్నారని, వీటి ద్వారా ముందస్తుగా వ్యాధిని గుర్తించేందుకు వీలు కలుగుతోందని వివరించారు. పింక్ బస్సుల ద్వారా ఇప్పటి వరకు 730 క్యాంపులు నిర్వహించి 42,609 మందికి స్క్రీనింగ్ చేశారని, 3226 మందిని స్విమ్స్కు రెఫర్ చేసారని వీరిలో 759 మందికి పూర్తి చికిత్స అందించారని తెలియజేశారు. పేషంట్లకు విశేష సేవలు అందిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డ్కా ఆర్.వి.కుమార్ గారిని, వైద్య బృందాన్ని అభినందించారు.

స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డ్కా ఆర్.వి.కుమార్ గారు మాట్లాడుతూ... క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకమని ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. స్విమ్స్ 20 ఏళ్ళుగా క్యాన్సర్ వైద్య సేవలను అందిస్తోందని, టి.టి.డి సహకారంతో ఈ విభాగాలను ఆధునీకరించి, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ మరియు మెడికల్ ఆంకాలజీ విభాగాలలో పూర్తి స్థాయిలో శస్త్ర చికిత్సలు, వైద్యసేవలు అందిస్తున్నామని వివరించారు. వీటితో పాటు క్యాన్సర్ వ్యాధి చికిత్స దశ దాటిపోయిన వారికి ఉపశమన వైద్య సేవలు అందించేందుకు పాలియేటివ్ కేర్ విభాగాన్ని అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు ఎన్.టి.ఆర్ వైద్య సేవ ద్వారా పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని అదనంగా అయ్యే వైద్య ఖర్చులను ప్రాణదానం పథకం క్రింద అందజేస్తున్నామని తెలియజేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి సుబ్రమణియన్, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి భార్గవి, పాలియేటివ్ కేర్ వింగ్ ప్రొఫెసర్ ప్రాణబంధు దాస్ తో పాటు వైద్యులు దీప్తి, ఆదిత్య తదితరులు పలు రకాల క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవగాహన పోస్టర్ల ప్రదర్శనను సాయంత్రం వరకు విశేష సంఖ్యలో ప్రజలు సందర్శించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర, కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి కె.నాగరాజ్, ఫిజియోథెరపి కళాశాల ప్రిన్సిపాల్ కె.మాధవి, త్రివేండ్రంకు చెందిన ఇంటర్నేషనల్ పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ వింగ్ అడ్వైజర్ రాధ, ఆర్.ఎం.ఓ. కోటి రెడ్డి, డిప్యూటి డైరెక్టర్ (ఎస్టాబ్లిష్మెంట్) ఆదిక్రిష్ణయ్య, ఎ.డి. (పి.ఆర్) వి.రాజశేఖర్, ఎం.ఎస్.డబ్ల్యూ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్ధ క్లినికల్ రీసెర్చ్ యూనిట్ ఆధ్వర్యంలో..

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్విమ్స్ నిర్వహించిన ర్యాలీలో సిద్ధ క్లినికల్ రీసెర్చ్ యూనిట్ డాక్టర్లు పాల్గొన్నారు. అనంతరం క్యాన్సర్ పాలియేటివ్ కేర్కి సంబంధించిన సమాచారాన్ని తెలియజేసే కరపత్రాలు, ముడి ఔషదాలు , మిల్లెట్స్, యోగాసనాల స్టాల్స్ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ ఆఫీసర్ కె.సామ్రాజ్, మెడికల్ కన్సల్టెంట్ ఆర్.తమిళసెల్వన్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిసిల డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమమే

**తిరుపతి/అమరావతి, ఫిబ్రవరి 4 మనం న్యూస్ :** రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలను దశాబ్దాలుగా మోసం చేస్తూ, వారి ఐక్యతను దెబ్బతీస్తున్న టీడీపీ, వైసీపీ పార్టీల రెండు నాల్కల ధోరణికి చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని భారతచైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ ఉద్ఘాటించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో, ఫిబ్రవరి 22న జరగనున్న చారిత్రాత్మక 'బీసీ సింహగర్జన' మహాసభ పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీల ఆత్మగౌరవం, అధికారం కోసం జరిగే ఈ స్వాతంత్ర్య పోరాటంలో ప్రతి బీసీ బిడ్డ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

**బిసిలను వంచిస్తున్న టిడిపి, వైసిపి**

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీసీలపై ప్రేమ ఒలకబోయడం, అధికారంలోకి వచ్చాక వారిని అణచివేయడం ప్రధాన పార్టీలకు అలవాటుగా మారిందని రామచంద్రయాదవ్ విమర్శించారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత బీసీలను పూర్తిస్థాయిలో వంచించే కార్యక్రమం జరిగిందే తప్ప, వారికి మేలు చేసింది శూన్యమన్నారు. తమ పార్టీ, బీసీ సంఘాలతో కలిసి డిసెంబర్ 11న బీసీల ప్రధాన సమస్యలపై చర్చించి, ప్రభుత్వానికి డిమాండ్లు సమర్పించినా, వాటిని పరిష్కరించాల్సింది పోయి, బీసీ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు, కుట్రపూరితంగా చీలికలు తెచ్చేందుకు అధికార పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

**బీసీ సింహగర్జన' - ఐదు ప్రధాన డిమాండ్లు**

విజయవాడ-గుంటూరు హైవేలో, నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా, 'పూలే-అంబేద్కర్ ప్రాంగణం'గా నామకరణం చేసిన వేదికపై లక్షలాది మందితో జరగనున్న 'బీసీ సింహగర్జన' ద్వారా ఐదు ప్రధాన డిమాండ్లతో ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.



1. బీసీ రక్షణ చట్టం:₹ బీసీలపై జరుగుతున్న దాడులు, హత్యలపై కనీస స్పందన లేని ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, తక్షణమే 'బీసీ రక్షణ చట్టం' అమలు చేయాలి

2. రాజధానిలో బీసీల వాటా:₹ అమరావతిలో సేకరించిన 33 వేల ఎకరాల భూమిని చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని, 50% ఉన్న బీసీలకు అందులో వాటా ఎంత అని ప్రశ్నించారు. బీసీ పారిశ్రామికవేత్తలకు, కుల సంఘ భవనాలకు కనీసం వెయ్యి ఎకరాల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. తన బినామీలకు ఎంత రేటుకు కేటాయిస్తున్నారో బిసిలకు కూడా అదే ధరకు కేటాయించాలి

3. బీసీ కార్పొరేషన్లకు నిధులు:₹ నిర్వీర్యం చేయబడిన బీసీ కులాల కార్పొరేషన్లకు తక్షణమే నిధులు విడుదల చేసి, చేతివృత్తుల వారికి అండగా నిలేవాలి

4.సమగ్ర కులగణన:₹ రాష్ట్రంలో వెంటనే సమగ్ర కులగణన చేపట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా కులగణన చేయాలనేది తమ నాలుగవ డిమాండ్

5. 44% రిజర్వేషన్లు:₹ కులగణన ఆధారంగా విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు 44% రిజర్వేషన్లు అమలు చేసి తీరాలని... ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదు.

మహాసభ కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాదని, బీసీల సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నామని రామచంద్రయాదవ్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిన శ్రీకృష్ణుడు-జాంబవతిల కల్యాణ మహోత్సవాన్ని యాదవ, మాదిగ దంపతులతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం, పార్టీలో నూతనంగా నియమితులైన వివిధ కమిటీల సభ్యులచే బోడె రామచంద్రయాదవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, బీసీల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా పనిచేయాలని ఆయన నూతన నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# మోహన్ బాబు యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

**తిరుపతి, ఫిబ్రవరి 4 మనం న్యూస్ :** మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యం చంద్రగిరి పోలీస్ స్టేషన్లో ఎస్ఎఫ్ఐ నాయకులు అక్బర్ వినోద్ లపై నమోదు చేసిన కౌంటర్ కేసులను పోలీసులు ఎత్తివేయాలని, నిందితుడు మోహన్ బాబు ఆయన కుమారుడు మంచు విష్ణులను తక్షణం అరెస్టు చేయాలని తిరుపతిలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సమావేశ తీర్మానాలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం మీడియాకు విడుదల చేశారు.

మోహన్ బాబు యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని, విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన రూ 26 కోట్లను తక్షణం విద్యార్థుల కుటుంబాలకు చెల్లించాలని, ప్రధాన నిందితులు మోహన్ బాబు, మంచు విష్ణు లతోపాటు ఘటనలో ఉన్న బౌన్సర్లు, ఇతర దోషులను అరెస్టు చేసి జైలుకు పంపాలని సమావేశం తీర్మానించింది.

విద్యార్థులపై జరిగిన దాడి కిడ్నాప్ తదితర చర్యలను నిరసిస్తూ అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నాడు బాలాజీ కాలనీలోనే జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మోహన్ బాబు మంచు విష్ణు లో దిష్టిబొమ్మలను దగ్ధం చేయటం జరుగుతుందని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. శుక్రవారం నాడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలలో విద్యాసంస్థల బంద్ జరుగుతుందని తిరుపతిలోని అన్ని ప్రైవేటు ప్రభుత్వ విద్యాసంస్థలు బందుకు సంఘీభావం ప్రకటించి మూసివేయాలని నేతలు యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, సిపిఐ ఎంఎల్ తిరుపతి నగర కార్యదర్శి పి వెంకటరత్నం,ఆర్.పి.ఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి. అంజయ్య మాట్లాడుతూ మోహన్ బాబు విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థుల వద్ద అక్రమంగా 26 కోట్ల రూపాయలు ఫీజులు పేరుతో వసూలు చేయడాన్ని ప్రశ్నిస్తే కిడ్నాప్ చేస్తారా? అని ప్రశ్నించారు. మోహన్ బాబు నీచ సంస్కృతిని మానవతావాదులందరూ కూడా ఖండించాలన్నారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన విద్యాసంస్థలో రౌడీలు, గుండాలు, బౌన్సర్లను పెట్టుకొని ప్రశ్నించిన వారిపై బెదిరించడం, భౌతిక దాడులకు పాల్పడడం వంటి చర్యలుకు పాల్పడుతున్నారని అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ ను, యూనివర్సిటీ విద్యార్థినేత వినోద్ ను మోహన్ బాబు యూనివర్సిటీకి సంబంధించిన వారు వాహనాల్లో వచ్చి కిడ్నాప్ చేసి నేతలను తీవ్రంగా కొట్టారని, మోహన్ బాబునే ప్రశ్నించేంత గొప్ప వాళ్లా??? మా మాట వినకపోతే చంపేస్తామని బెదిరించారని తెలిపారు. కిడ్నాప్ జరిగిన వెంటనే జిల్లా ఎస్పీ గారి దృష్టికి, అడిషనల్ ఎస్పీ గారు, కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లడంతో కిడ్నాప్ విషయాన్ని సీరియస్ గా




తీసుకొని కిడ్నాపర్లను పట్టుకొని... బాధితులను పోలీసులు రక్షించారని అన్నారు. ఫిర్యాదు చేసిన గంటలలోనే కిడ్నాపర్ల ను పట్టుకొని విద్యార్థి నేతలను కాపాడినందుకు కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు రౌండ్ టేబుల్ సమావేశంలో అభినందనలు తెలియజేశారు. -కిడ్నాప్ కు పాల్పడిన యూనివర్సిటీ పీఆర్వో సతీష్ ను, బౌన్సర్లను ఈ సంఘటనకు కారకులైన మోహన్ బాబును, కుమారుడు విష్ణులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి నేతలపై తప్పుడు ఆరోపణలతో పెట్టిన కౌంటర్ కేసులను ఎత్తివేయాలని, విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.26 కోట్ల లను తిరిగి చెల్లించే విధంగా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. వివాదాలకు కారణమవుతున్న మోహన్ బాబు యూనివర్సిటీ అనుమతులను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మోహన్ బాబు విద్యా సంస్థల వద్ద ప్రవైట్ వ్యక్తులు హాస్టల్ నిర్మాణం చేసుకోవాలంటే ముందుగా మోహన్ బాబు పర్మిషన్ తీసుకోవాలని, ప్రతి నెలా హాస్టల్ యజమానులు ఒక్కొక్కరు యాభై వేల రూపాయలు మోహన్ బాబుకు చెల్లించాలని తెలిపారు.

కిడ్నాప్ కు గురైన అక్బర్, వినోద్ మాట్లాడుతూ

మోహన్ బాబు యూనివర్సిటీలో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాలపై విద్యార్థి సంఘాలుగా పోరాడుతూనే ఉంటామని తెలిపారు. తమకు అండగా నిలిచిన విద్యార్థి, యువజన, కార్మిక సంఘాలకు, ప్రజా సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నగేష్, బీసీ సంక్షేమ సంఘం అఖిలభారత నాయకులు ఆల్ మెన్ రాజు, తిరుపతి స్థానిక హక్కుల పోరాట కమిటీ నాయకులు డిఎంసి భాస్కర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు పవిత్ర, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్, ఎన్ ఎల్ ఎస్ ఏ అధ్యక్షులు సుందర్రాజు, జై భారత్ నేషనల్ పార్టీ స్టూడెంట్ విభాగం అధ్యక్షులు భార్గవ్ సాయి, తిరుపతి యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న విద్యార్థి సంఘాల నేతలను కిడ్నాప్ చేసినంత మాత్రాన, మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యం చేసిన తప్పుల నుండి తప్పించుకోలేరని అన్నారు. గత రెండు, మూడు సంవత్సరాలు నుండి విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకపోవడం వల్ల ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. అధికారంలో ఎవరు ఉన్నా, నన్ను ఎవరూ ఏమి చేసుకోలేరు అనే గర్వంతో మోహన్ బాబు చెప్పడాన్ని ఆయన అహంకారాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. వీరి మోసాలను రాష్ట్ర వ్యాప్తంగా తెలియజేస్తామని, వీరి ఆటలు కొనసాగనీయమని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రేపు ఉదయం 10 గంటలకు జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మోహన్ బాబు దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమం చేపట్టాలని, ఆరో తేదీ విద్యాసంస్థలు బంద్ నిర్వహించాలని తీర్మానించినట్లు ప్రకటన చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, సిపిఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచులయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు జయచంద్ర, జిల్లా కార్యదర్శి పి. సాయి లక్ష్మి, సిఐటియు జిల్లా నేతలు జి.బాలసుబ్రమణ్యం, పి. మునిరాజా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎన్ నరేంద్ర, మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు రామకృష్ణ, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు పి.బుజ్జి, ఎన్.మాధవ్, రైతు సంఘం జిల్లాకార్యదర్శి పి.హేమలత,ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రణీత్,ఎస్.ఎఫ్. ఐ నేతలు రవి,మహేష్ బాబు,నరసన్న తదితరులు పాల్గొన్నారు.

## కాలం నీ ముందు తలవంచాలి

నీవే ఆకలితో మండుతున్న
అగ్నిపర్వతానివి
నీవే సమానత్వం కొరకు
బుసలు కొట్టు ఫణివి
నిత్యం అవమానాలతో సెగలు
కక్కుతున్న అగ్నిశిఖవు నువ్వే

తెగించి తిరగబడితే లావాలా
బూడిద చేసేది నువ్వే
నీ మౌనం మత్తు కాదు..
అది విలయానికి ముందున్న
ప్రశాంతత కావాలి
నీ సహనం చేతకానితనం కాదు..
అది ఉప్పెనగా మారే
నిశ్శబ్దత అవ్వాలి ఎన్నాళ్లని భరిస్తావు?

ఈ దోపిడీ దొంగల కపట నాటకాలు?
ఎన్నేళ్లని మోస్తావు ఈ స్వార్థ
రాజకీయాల బానిస సంకెళ్లు?
చదువుల కోవెలలో కుట్రల
విషం చిమ్ముతుంటే
అక్షరాయుధమై అన్యాయం
గుండెల్లో గురిపెట్టు

ఓట్ల చదరంగంలో నిన్ను
పావుగా మారుస్తుంటే
ప్రశ్నించే గొంతుకవై
ప్రజాస్వామ్యానికి ప్రాణం పోయి
నిన్ను వాడుకుని వదిలేసే
వేదికలు నీకు వద్దు
నీ ఉజ్వల భవిష్యత్తును
అమ్ముకునే బేరాలు అసలే వద్దు
నువ్వు రగిలితే ఒక చైతన్యం,
నువ్వు కదిలితే ఒక నవశకం కావాలి
అణచివేత పునాదుల మీద నిర్మించు
నీ అచంచల సామ్రాజ్యం!
తెగించి చూడు..
దిక్కులు దద్దరిల్లేలా
గర్జించి చూడు..
కాలం నీ ముందు తలవంచేలా!

**- దుప్పటి. మొగిలి**
8466827118

# వికసిత్ భారత్... వీబీ&జీ రామ్ జీ

భారతదేశం వికసిత దేశంగా మారాలనే లక్ష్యంతో, 2047 నాటికి 'వికసిత్ భారత్'ను సాకారం చేయడానికి ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోంది. ఈ సందర్భంలో, 2025 డిసెంబర్ 16న లోక్‌సభలో ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ - గ్రామీణ రోజ్‌గార్ మరియు ఆజీవిక మిషన్ (**VB&G RAM G**) చట్టం, 2025 ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (**MGNREGA**)ను భర్తీ చేస్తూ, గ్రామీణ భారతదేశాన్ని మరింత బలోపేతం చేయడానికి రూపొందించబడింది. ఇది సమయానుగుణమైన పరిణామం దేశ అవసరాలకు తగినట్లు ఎలా మార్పులు తెచ్చింది, మరియు సహకార సమాఖ్య వ్యవస్థ ద్వారా ప్రజా సంక్షేమాన్ని ఎలా పెంచుతుంది అనేవి పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ఈ చట్టం ఒక గుణాత్మకమైన మార్పు కోసం తయారు చేయబడింది. ఎందుకంటే **MGNREGA** 2005లో ప్రవేశపెటబడినప్పుడు, గ్రామీణ పేదరికాన్ని తగ్గించడం, ఉద్యోగాలు సృష్టించడం ద్వారా సామాజిక భద్రతా జాలాన్ని అందించడం దాని లక్ష్యం. అయితే, 20 సంవత్సరాల తర్వాత, భారత ఆర్థిక వ్యవస్థ మారింది. కోవిడ్-19 మహమ్మారి, వాతావరణ మార్పులు, డిజిటల్ టెక్నాలజీల పెరుగుదల వంటి కొత్త సవాళ్లు ఎదురయ్యాయి.

**VB&G RAM G** చట్టం ఈ మార్పులను ఎదుర్కొని పీడిత ప్రజలను అభివృద్ధి వైపుగా ప్రయాణించేలా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందనే చెప్పాలి. లక్ష్యం ఆధారిత ఉపాధి కల్పన ద్వార ఇది పాత చట్టం యొక్క బలహీనతలను సరిచేస్తూ, మరిం త ఆధునిక, ఫలితాల ఆధారిత విధానాన్ని అవలం బిస్తుంది.

ఉదాహరణకు, **MGNREGA**లో ఏటా 100 రోజుల ఉపాధి హామీ ఉండేది. **VB&G RAM G**లో ఇది 150 రోజులకు పెంచబడింది, ముఖ్యంగా విపత్తు ప్రాంతాల్లో మరియు ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల్లో ఇది గ్రామీణ కార్మికులకు మరింత ఆదాయ భద్రతను అందిస్తుంది. అంతేకాకుండా, చట్టం నీటి నిర్వహణ, గ్రామీణ కనెక్టివిటీ, వ్యవసాయ సహాయం వంటి కీలక రంగాల్లో స్థిరమైన ఆస్తులను సృష్టించడానికి ప్రాధాన్యత ఇస్తుంది. ఇది కేవలం ఉద్యోగాలు సృష్టించడం మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుంది. ఈ మార్పులు భారతదేశం యొక్క ప్రస్తుత అవసరాలకు, ముఖ్యంగా వాతావరణ మార్పులకు తగినట్టుగా ఉన్నాయి.

అయితే, ఒక విమర్శాత్మక అంశం ఏమనగా పాత చట్టం డిమాండ్-ఆధారిత హక్కును అందించేది, కానీ **VB&G RAM G**లో ఇది మరింత కేంద్రీకృతమై, బడ్జెట్-నిర్బంధితమైంది. ఇది కొంతమంది కార్మికులకు ఇబ్బందిగా ఉండవచ్చు కాని దీర్ఘకాలిక ప్రయోజనాలను కలింగిచేలా రూపొందిచబడింది. అయినప్పటికీ, ఇది పాత వ్యవస్థలోని అవినీతి, ఆలస్యాలను తగ్గించడానికి సహాయపడుతుంది. పారదర్శకత మరియు జవాబుదారీతనం కలిగిన పరిపాలన దిశగా దేశం అడుగులు



**VB&G RAM G** చట్టం భారతదేశం యొక్క విభిన్న అవసరాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించబడింది. ఇందులో బయోమెట్రిక్ ధృవీకరణ, అఐ-ఆధారిత మోసాల గుర్తింపు, **GPS** ట్రాకింగ్ వంటి టెక్నాలజీలను అనుసంధానం చేయడం ద్వారా పారదర్శకతను పెంచుతుంది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విప్లవాన్ని ప్రోత్సహిస్తుంది, ముఖ్యంగా యువతకు నైపుణ్యాలు అందించడం మరియు జవాబుదారితనం రాష్ట్ర ప్రభుత్వాల పనితీరులో పెంపొందాలని ఈ నూతన చట్టం లక్ష్మణ రేఖలు దిద్దింది.

అంతేకాకుండా, చట్టం వికసిత భారత్ 2047 దృష్టికి అనుగుణంగా వేతనాలను పెంచుతుంది. ఇది మహిళలు, దివ్యాంగులు, షెడ్యూల్ కులాలు/తెగలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంది, సమ్మిళిత అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుంటుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా, ఇది పట్టణ వలసలను తగ్గించి, స్థానిక అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

ఈ చట్టం చిన్న రైతులకు ప్రత్యేకంగా భూమిలేని నిరుపేద రైతు కూలీలకు మరింతగా సహాయపడుతుంది. వ్యవసాయ సంబంధిత ప్రాజెక్టులలో కార్మిక శక్తిని అందుబాటులో ఉంచడం ద్వారా, రైతులు తమ పొలాల్లో పనులు చేయడానికి అవసరమైన మానవ వనరులను సులభంగా పొందవచ్చు. ముఖ్యంగా పంటల కాలాల్లో లేదా ఆఫ్-సీజన్లో కార్మికుల కొరతను తీర్చడం, నీటి సరఫరా, భూమి సంరక్షణ వంటి పనులలో సహాయం అందించడం ద్వారా రైతుల ఉత్పాదకతను పెంచుతుంది. అనతరం భూమిలేని రైతు కూలీలకు సైతం ఉపాధిని కలిగిస్తుంది. అదేవిధంగా చిన్న రైతుల ఆదాయాన్ని మెరుగు పరుస్తుంది మరియు వారి ఆర్థిక స్థిరత్వాని కి తోడ్పుతుంది.

అదనంగా, ఈ చట్టం నిస్సహాయ స్తితిలో ఉన్న ఇతర వర్గాలకు కూడా ప్రయోజనాలు అందిస్తుంది. మహిళలు, దివ్యాంగులు, షెడ్యూల్ కులాలు/తెగలు, వృద్ధులు వంటి వారికి ప్రత్యేక ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, మరియు ఆర్థిక సహాయం అందుబాటులో ఉంచుతుంది. ఉదాహరణకు, మహిళలకు 33% రిజర్వేషన్, దివ్యాంగులకు సులభమైన పని వాతావరణం, మరియు వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యతా ప్రాజెక్టులు ద్వారా వారి సామాజిక-ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఇది సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలను అందిస్తూ, సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. అటువంటి అభివృద్ధి ఫలాలు ప్రజలందిరికి చేకూరితే ప్రముఖ భారతీయ తత్వవేత్త దంత్తోపంత్ తెంగిడి గారు ఆశించిన విధంగా సమాజంలో సమాజిక సమరసత సాధ్యం అవుతుంది.

చాలామంది విమర్శించిట్టుగా టెక్నాలజీ అనుసంధానం గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ లభ్యత లేని వంటి సవాళ్ళు మనం అధిగమించలేనంతటివి ఏమికాదు. అయితే, ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు, స్థానిక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు.

**సహకార సమాఖ్య వ్యవస్థ: ప్రజా సంక్షేమానికి మార్గం**

భారతదేశం ఒక ఫెడరల్ దేశం, మరియు **VB&G RAM G** చట్టం సహకార ఫెడరలిజాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని పెంచుతుంది, రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛ ఇస్తుంది ప్రాంతీయ అవసరాలకు తగినట్లు కార్యక్రమాలు రూపొందించడానికి. ఉదాహరణకు, రాష్ట్రాలు స్థానిక ప్రాజెక్టులు ఎంచుకోవచ్చు, కానీ కేంద్ర మార్గదర్శకాలు పాటించాలి. ఇది పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తుంది, గ్రామ సభలు ప్రాజెక్టులు ప్రణాళిక చేయడంలో పాలుపంచుకోవడానికి అవకాశం ఇస్తుంది. ఇది స్థానిక స్వపరిపాలనను ప్రోత్సహిస్తుంది, ప్రజా సంక్షేమాన్ని మెరుగుపరుస్తుంది. ఇది ఏకరూపతను నిర్ధారిస్తుంది, అవినీతిని తగ్గిస్తుంది, మరియు జాతీయ లక్ష్యాల తో సమన్వయం చేస్తుంది.

**ముగింపు**

**VB&G RAM G** చట్టం, 2025 భారతదేశ గ్రామీణ అభివృద్ధికి ఒక సమయానుగుణమైన పరిణామం. ఇది మార్పులు తెచ్చి, దేశ అవసరాలకు తగినట్లు రూపొందించబడింది, సహకార ఫెడరలిజం ద్వారా ప్రజా సంక్షేమాన్ని పెంచుతుంది. విమర్శలు ఉన్నప్పటికీ, ఇది ఒక ముందడుగు. సరైన అమలు ద్వారా సమ సమాజ శ్రేయస్సే స్థాపన దిశగా ఇది వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**- డా.జి. అశోక్, అసిస్టెంట్ ప్రొఫెసర్**
ఇందిరాగాంధి నేషనల్ ఓపెన్ యూనివర్సిటి (ఇగ్నో)
9676896300

# మట్టి మనిషి 'వట్టికోట'

తెలంగాణ ప్రజాసాహిత్య చరిత్రలో వట్టికోట ఆళ్వారుస్వామిది ఒక మహోన్నత స్థానం. ఆయన కేవలం రచయిత మాత్రమే కాకుండా ఉద్యమకర్త, కమ్యూనిస్టు నాయకుడు, ప్రచురణ కర్త, పాత్రికేయుడిగా విభిన్న రంగాలలో సేవలందించారు. భాషా సాహిత్యం నుంచి పౌరహక్కుల ఉద్యమాల వరకు అనేక రంగాలలో ఆయన తన ప్రతిభను ప్రద ర్శించారు. ఆయనకు 'తెలంగాణ ప్రజా సాహిత్య పితామహుడు' అనే బిరుదు అందించారు.

1915 నవంబర్ 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చెరువు మాదారం అనే గ్రామంలో జన్మించిన ఆళ్వారుస్వామి, చిన్నతనం నుండే సామాజిక అన్యాయాలను గమనించారు. ఈ అన్యాయాలు ఆయనలో చైతన్యాన్ని, మార్పు తపనను రేకెత్తించాయి. ఆయనకు సాహిత్యం పట్ల ఉన్న ఆసక్తిని 'గ్రంథాలయోద్యమం' మరింత పెంచింది. నిజాం పాలనలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ దౌర్జన్యాలు ఆయనను రాజకీయాల వైపు నడిపించాయి.

వట్టికోట ఆళ్వారుస్వామి నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. పేద ప్రజల పట్ల అన్యాయం, వివక్షలపై ఆయన గళం ఎత్తారు. ఈ ఉద్యమంలో ఆయన అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారు. జైలు జీవితం ఆయన వ్యక్తిత్వం, సాహిత్యంపై విపరీతమైన ప్రభావం చూపింది. జైలులో ఉన్నప్పుడు ఆయన తన అనుభవాలను కథల రూపంలో అభివ్యక్తం చేయడం ప్రారంభించారు. 'జైలు లోపల' అనే కథా సంపుటి ఆయన జైలు అనుభవాలకు ప్రతిబింబంగా నిలిచింది, ఇందులో జైలు లోపల నిర్బంధితుల జీవితం, వారి బాధలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి.

తెలుగులో రాజకీయ నవలలను రచించిన మొట్ట మొదటి వ్యక్తిగా వట్టికోట ఆళ్వారు స్వామి ప్రసిద్ధి చెందారు. ఆయన 'ప్రజల మనిషి' అనే నవల రచించి తెలంగాణ ప్రజల జీవన పరిస్థి



తులను, సామాజిక అన్యాయాలను, ప్రజల మానసిక స్థితిగతులను ప్రతిబింబించారు. ఈ నవల ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులపై తీవ్ర విమర్శగా నిలిచింది. వట్టికోట రచనల్లోని కథలు, నాటికలు సమాజాన్ని విమర్శిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసే లక్ష్యంతో ఉన్నవి. సురవరం ప్రతాప రెడ్డి హైదరాబాద్ లో స్థాపించిన 'గోలకొండ' పత్రికలో ప్రూఫ్‌రీడర్ గా పని చేసారు.

వట్టికోట ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, ప్రజా స్వేచ్ఛను కాపాడటానికి కృషి చేశారు. సమాజంలో న్యాయం, సమానత్వం రావాలనే ఆశయంతో ఆయన అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వట్టికోట ప్రజాసాహిత్య చైతన్యానికి ఒక బలమైన పునాదిగా నిలిచారు. ప్రజల జీవన గాథలను సాహిత్యంలోకి తీసుకురావడం ద్వారా సామాజిక మార్పు తపనను ప్రేరేపించారు.

తెలంగాణాలో స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణా రచయితల సంఘం వంటి సామాజిక, రాజకీయ సాహిత్య సంస్థలలో కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశారు. హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, 1944లో గుమాస్తాలు సంఘం, రిక్షాకార్మిక సంఘం, రైల్వే ఉద్యోగులు, కార్మిక ఉద్యోగుల సంఘాలకు నాయకత్వం వహించారు.

వట్టికోట ఆళ్వారుస్వామి కేవలం ఒక రచయిత మాత్రమే కాకుండా సమాజ సేవకుడు, ఉద్యమకర్త, ప్రజల చైతన్య దాత అని చెప్పవచ్చు. ఆయన రచనలు ప్రజల బాధలను, వారి ఆశయాలను ప్రతిబింబిస్తూ, ప్రజాస్వామ్య పునాదుల స్థాపనకు తోడ్పడతాయి. ఆయన సాహిత్యం తెలంగాణ ప్రజా సాహిత్యంలో ఒక అద్భుతమైన అధ్యాయంగా నిలిచిపోతుంది.

దాశరథి వట్టికోట కలసి 1948లో మూడు నెలలు నిజామాబాద్ జైలులో ఉన్నారు. దాశరథి పద్యాలు జైలు గోడల మీద రాసి దెబ్బలు తిన్నారు. 1961 ఫిబ్రవరి 5న మరణించారు.

**ఫిబ్రవరి 5...వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# పెరుగుతున్న సామాజిక అసమానతలు..?



సాధారణంగా వాతావరణ మార్పులను ఉష్ణోగ్రతల పెరుగుదల, సముద్ర మట్టం పెరగడం, కార్బన్ ఉద్గారాల గణాంకాల రూపంలో మాత్రమే చర్చిస్తారు. కానీ వాస్తవానికి ఇది జీవన హక్కు, అభివృద్ధి హక్కు, సమానత్వం వంటి మౌలిక మానవ విలువలతో నేరుగా ముడిపడి ఉంది. అంతర్జాతీయ వాతావరణ మార్పు మండలి (**IPCC**) ప్రకారం, మానవ కార్యకలాపాలే వాతావరణ మార్పుకు ప్రధాన కారణం, దాని ప్రభావాలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందువల్ల ఇది భవిష్యత్ ప్రమాదం మాత్రమే కాక , ప్రస్తుతం కొనసాగుతున్న సామాజిక సంక్షోభం.



వాతావరణ మార్పును సామాజిక న్యాయ సమస్యగా పరిగణించడానికి ప్రధాన కారణం బాధ్యత మరియు బాధ మధ్య ఉన్న తీవ్రమైన అసమానత. ప్రపంచవ్యాప్తంగా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు ప్రధానంగా కారణమైనవి కొద్ది సంపన్న దేశాలు మరియు అధిక వినియోగ జీవనశైలి కలిగిన వర్గాలు. 2023 నాటికి ప్రపంచ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు సుమారు 53 గిగాటన్నుల ఇ సమానంగా నమోదయ్యాయి. చారిత్రకంగా పరిశ్రమల విప్లవం నుంచి ఇప్పటివరకు అధిక కార్బన్ ఉద్గారాలకు బాధ్యత వహించినవి ఉత్తర అమెరికా మరియు యూరోప్ దేశాలే. కానీ ఆఫ్రికా, దక్షిణ ఆసియా, చిన్న దీవి దేశాలు అత్యల్ప ఉద్గారాలు చేసినప్పటికీ, తీవ్రమైన కరువులు, వరదలు, తుఫాన్లు వంటి విపత్తులను ఎదుర్కొంటున్నాయి. ఈ అసమానతే క్లైమేట్ జస్టిస్ భావనకు మూలం.

ఇటీవలి ప్రపంచ సంఘటనలు ఈ వాస్తవాన్ని మరింత స్పష్టంగా నిరూపిస్తున్నాయి. 2022లో పాకిస్తాన్‌లో సంభవించిన వరదలు దేశంలోని విస్తృత ప్రాంతాలను ముంచెత్తి లక్షలాది మందిని నిరాశ్రయులను చేశాయి. వ్యవసాయం, ఆహార భద్రత, ఆరోగ్యం అన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. అదే విధంగా దక్షిణ ఆఫ్రికా ప్రాంతాల్లో సంభవించిన భారీ వరదలు వాతావరణ మార్పు ప్రభావాలు ఎంత ప్రమాదకరంగా మారుతున్నాయో సూచిస్తున్నాయి. ఈ విపత్తుల్లో ప్రధానంగా బాధపడినవారు పేద ప్రజలే. సంపన్న వర్గాలకు విపత్తుల తర్వాత తిరిగి నిలబడే సామర్థ్యం ఉన్నా, పేదల కోసం అదే విపత్తు దీర్ఘకాలిక పేదరికంగా మారుతోంది. వాతావరణ మార్పు ప్రభావాలు పేద ప్రజలపై అనుపాతానికి మించి పడుతున్నాయి. పేదలు సాధారణంగా వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో, అసురక్షిత గృహాల్లో నివసిస్తారు. వారికి బీమా, పొదుపు, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు ఉండవు. దీనితో పాటు వాతావరణ మార్పు ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అస్థిర వర్షపాతం, కరువులు వ్యవసాయ ఉత్పత్తిని తగ్గిస్తున్నాయి. చిన్న రైతులు పంటలు కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పిల్లలు, మహిళలు పోషకాహార లోపానికి గురవుతున్నారు. ఈ పరిస్థితులు ఆకలి మరియు ఆరోగ్య అసమానతలను మరింత పెంచుతున్నాయి.

వాతావరణ మార్పు యొక్క మరో కీలక పరిణామం క్లైమేట్ రెఫ్యూజీస్ సమస్య.

సముద్ర మట్టం పెరుగుదల, ఎడారీకరణ, వరదల కారణంగా ప్రజలు తమ నివాసాలను వదిలి వలస వెళ్లాల్సి వస్తోంది. కానీ ఈ వాతావరణ వలసదారులకు అంతర్జాతీయ చట్టాల్లో స్పష్టమైన గుర్తింపు లేకపోవడం వల్ల వారు సామాజిక, ఆర్థిక వివక్షను ఎదుర్కొంటున్నారు. ఇది తీవ్రమైన సవాలుగా మారుతోంది.అందువల్ల వాతావరణ మార్పును సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే వాతావరణ న్యాయాన్ని కేంద్రంగా పెట్టిన విధానాలు అవసరం.

సంపన్న దేశాలు తమ చారిత్రక బాధ్యతను అంగీకరించి పేద దేశాలకు ఆర్థిక సహాయం, సాంకేతిక బదిలీ అందించాలి. న్యాయమైన మార్పు ద్వారా ఫాసిల్ ఇంధన రంగంపై ఆధారపడిన కార్మికులకు రక్షణ కల్పించాలి. మహిళలు, ఆదివాసీలు, పేద వర్గాలను నిర్ణయ ప్రక్రియల్లో భాగస్వాములుగా చేయాలి. వాతావరణ మార్పు మన ముందుంచుతున్న అసలు ప్రశ్న ఏమిటంటే మన అభివృద్ధి ఎవరి కోసం?.

ఎవరి ఖర్చుతో జరుగుతోంది అన్నదే. అందరికీ వాతావరణ సమతుల్య న్యాయాన్ని కేంద్రంగా అనుసరించే విధానాలే పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, మానవ గౌరవాన్ని ఒకేసారి సాధించగలవు. వాతావరణ న్యాయం, ఆర్థిక సహకారాలతోనే వాతావరణ సంక్షోభాల పరిష్కారం సాధ్యం అవుతుంది.

**- గిలకత్తుల వెంకటరమణ గౌడ్**
9866878769

# ప్రజలను భయపెట్టే వ్యూహం వైసీపీది



రాజకీయంగా ఉనికి కోసం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఒక వ్యూహంగా వైసీపీ మార్చుకుంది. అధికారంలో ఉంటే పీకలు కోయడం, హింసాత్మక దాడులను ప్రోత్సహించిన జగన్. అధికారం పోయాక కూడా అదే తరహాలో తన పార్టీ మూకలను రెచ్చగొడుతున్నారు. స్వయంగా అధినేతే హింసను, దాడులను ప్రోత్సహిస్తుండడంతో, వైసీపీ మూకలు గంజాయి మత్తులో మారణాయుధాలతో రాష్ట్రంలో స్త్వైర విహారం చేస్తున్నాయి.

వైసీపీ నేతల హింసోన్మాదం సమాజ ప్రశాంతతను, రాష్ట్ర భవిష్యత్తుకు ఆటంకంగా తయారయింది. వైసీపీ అనుసరిస్తున్న తీరు గమనిస్తే, అది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా, ఒక రకమైన సామాజిక ఉన్మాదాన్ని ప్రేరేపించేలా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సోషల్ మీడియా వేదికల నుండి ప్రత్యక్ష దాడుల వరకు.. రప్పా రప్పా డైలాగుల నుండి కత్తులు,తల్వార్లు చూపిస్తూ చేసే హెచ్చరికల వరకు.. జంతు బలులతో రక్తాభిషేకాల వరకు.. ఇవన్నీ ఒక ప్రకడ్బందీ వ్యూహంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు బీహార్‌లో ఉండే ఈ అరాచకం నేడు ఆంధ్ర రాష్ట్రానికి వైసీపీ నేతలు తీసుకువస్తున్నారు.

ప్రభుత్వాలు మారినప్పుడు కక్షసాధింపు చర్యలు సహజమని భావించే కాలంలో, ప్రస్తుత ప్రభుత్వం చట్టాన్ని గౌరవిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్లడాన్ని కొందరు అలుసుగా తీసుకుంటున్నారు. చట్టబద్ధమైన పాలన దిశగా అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వ పాలననీ చేతగాని తనం అనుకోవడం వైసీపి అవివేకానికి తార్కాణం. చట్టాన్ని అమలు చేయడం అంటే హింసించడం కాదు, తప్పు చేసిన వారికి చట్టం ద్వారా శిక్ష పడేలా చూడటం. ఈ మౌనాన్ని చేతకానితనంగా భావిస్తే, చట్టం తన పని తాను చేసుకుపోయినప్పుడు వచ్చే ఫలితం తీవ్రంగా ఉంటుంది. అయితే చట్టమన్నా, న్యాయస్థానాలన్నా వైసీపీ నేతలకు గౌరవమనేది ఎప్పుడు లేదు. రాజకీయాల్లో గెలుపు ఓటములు అనేవి సహజం. గెలిస్తే తన ఇష్టారాజ్యంగా పాలిస్తామంటే కుదరదు. ప్రజల్లో ఒక రకమైన భయాందోళన సృష్టించి, ఏవేవో అంశాలను తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించడం అనేది తగదు. అధికారంలో ఉన్నప్పుడు సమర్థించి.. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం కదా అని వ్యతిరేకిస్తాము అంటే కుదరదు. ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు కూడా. ఒక రాజకీయ నాయకుడిగా పాటించాల్సిన కనీస విలువలు, ఒక రాజకీయ పార్టీకి ఉండాల్సిన కనీస విశ్వసనీయత లేకుండా వైసీపీ రాజకీయం నడిపింది. ప్రత్యర్థి పార్టీల నేతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది.

15 ఏళ్ల వైయస్సార్ కాంగ్రెస్ ప్రస్థానంలో.. ఒక ఐదేళ్లు మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. మిగిలిన కాలంలో ఏపీ ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారు. అయితే దానిపై ఎంత మాత్రం ఆలోచన చేయడం లేదు. బూతు మాటలతో, కవ్వింపు చర్యలతో వైసిపి 2.0 కోసం కలలు కంటున్నారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడేదో తాను సుపరిపాలన అందించానని.. తన హయాంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ఐదేళ్ల పాలనలో జరిగిన ఘటనలు గుర్తు



చేసుకుంటే నిద్ర పట్టదు.

రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లను రాజకీయ అవసరాలకు వాడుకుని రోడ్డున పడేసిన జగన్, ఇప్పుడు తన సొంత పార్టీ నేతలను కూడా అదే బాటలో నడిపిస్తున్నారు. బూతులు మాట్లాడితేనే పదవులు, గుర్తింపు దక్కుతాయనే భ్రమలో ఉన్న నేతలు.. ఆ భాష వల్లే ప్రజల్లో చీదరింపుకు గురవుతున్నారు. వ్యక్తిగత ప్రతిష్టను పణంగా పెట్టి పార్టీ కోసం తిట్లు తింటున్నా, కనీసం నైతిక మద్దతు ఇచ్చే నాథుడు లేకపోవడం వైసీపీ నేతల దుస్థితికి అద్దం పడుతోంది. వాలంటీర్లకైనా కనీసం గుర్తింపు ఉండేదేమో కానీ, ఈ కాలకేయ నేతలకు మాత్రం సొంత పార్టీలోనే గౌరవం లేని పరిస్థితి నెలకొంది.

ఇన్ని అవమానాలు, ఇంతటి నిర్లక్ష్యం ఎదురవుతున్నా ఇంకా ఆ పార్టీలో కొనసాగడం అంటే ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమే. వాడుకుని వదిలేసే సంస్కృతి ఉన్న చోట విధేయత చూపడం అంటే, తమ రాజకీయ జీవితాన్ని తామే చేజేతులా సమాధి చేసుకోవడమే. సిగ్గులేని ఈ బానిస బతుకుల కంటే, స్వతంత్రంగా ఉండటమే మేలనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. జగన్‌రెడ్డి రాజకీయాన్ని నమ్ముకుని ఆయన వెంట నడిచిన వారు బాగుపడిన చరిత్ర లేదు. ఆ విషయం గుర్తు తెచ్చుకుంటే.. వైసీపీ నేతలకు తమకు ఓ క్లారిటీ వస్తుంది

పల్నాడులో బోండా ఉమామహేశ్వరరావు కారుపై జరిగిన దాడి ఇప్పటికీ సోషల్ మీడియాలో కనిపిస్తూనే ఉంటుంది. ఇనప రాడ్లతో దాడి చేశారు అప్పట్లో. దానిని ప్రోత్సహించింది అప్పటి వైసీపీ పాలకులు కాదా? అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై జోగి రమేష్ దండయాత్ర చేశారు. కర్రలతో దాడికి దిగారు. అందులో తప్పేముంది అని ప్రశ్నించి జగన్ సమర్థించుకున్నారు. అప్పటి వైసీపీ నేతలు గంట అరగంట భాగోతాలు, అనంతబాబు డోర్ డెలివరీ అరాచకాలు, గోరంట్ల మాధవ్ విశ్వరూపాలు ఆస్వాదించిన జగన్ ఇప్పుడు అరవ శ్రీధర్ విషయంలో విలువలు అంటూ ఉపన్యాసాలు చేస్తున్నారు. తాను చేస్తే నీతి.. ఎదుటివాడు చేస్తే బూతు అన్నట్టు హంగామా చేస్తున్నారు. నాడు చంద్రబాబు అరెస్టు సక్రమం అన్నారు. ఇప్పుడు మాత్రం అరెస్టులు చేస్తే అక్రమం అంటున్నారు. అయితే జనాలు అన్ని గమనిస్తున్నారన్న విషయాన్ని మరిచిపోతున్నారు.


రాజకీయ విమర్శలు సిద్ధాంతపరంగా ఉండాలి కానీ, వ్యక్తిగత దూషణలుగా మారకూడదు. వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా వాడుతున్న భాష రాష్ట్ర రాజకీయ సంస్కృతిని దిగజార్చుతోంది. దీన్ని ఆదిలోనే అరికట్టకపోతే, భవిష్యత్ తరాలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయి. కాలకేయ ధోరణితో రెచ్చిపోతున్న వారికి చట్టపరమైన కఠిన చర్యలే సరైన మందు. నోటి పారుదలని ప్రజాస్వామ్య హక్కుగా భావించలేము. ప్రజల్లో అలజడి సృష్టించి, ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచాలనేది ఒక వ్యూహాత్మక కుట్రలా కనిపిస్తోంది. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రభుత్వం సహనం కోల్పోయేలా చేసి, ఆపై బాధితుడి కార్డు ప్లే చేయాలనేది పాత పద్ధతి. ఇలాంటి వ్యూహాలను చిత్తు చేయాలంటే, ప్రభుత్వం ఊహించని రీతిలో, పక్కా ఆధారాలతో చట్టపరమైన ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

గతంలో డీజీపీ వంటి రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని కూడా రాజకీయ అవసరాలకు వాడుకున్న తీరు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల కళ్ల ముందే ఉంది. ఇప్పుడు ఆ వ్యవస్థలను మళ్లీ గాడిలో పెట్టే ప్రయత్నం జరుగుతోంది. చట్టం తన పని తాను చేయనివ్వడం అంటే అధికారులకు స్వేచ్ఛనివ్వడం. దీన్ని ప్రభుత్వం బలహీనతగా భావించడం వైసీపీ నేతల అవివేకం. వ్యవస్థలు ఒక్కసారి యాక్టివేట్ అయితే, అరాచక శక్తులకు పారిపోయే దారి కూడా దొరకదు. ప్రజాస్వామ్యంలో ఓర్పుకు కూడా ఒక హద్దు ఉంటుంది. అడ్డగోలుగా తిడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిని ఉపేక్షించడం అంటే పరోక్షంగా వారిని ప్రోత్సహించడమే అవుతుంది. మిగిలిన వారు ఇలాంటి ధైర్యం చేయకుండా ఉండాలంటే మొదట్లోనే చెలరేగే వారిపై కఠినంగా వ్యవహరించాలి. రౌడీయిజానికి రాజకీయం ముసుగు వేస్తే అది చెల్లదని నిరూపించాల్సిన సమయం ఆసన్నమైంది.

**- వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖ మంత్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# వీరమ్మ దంపతులకు ఘనంగా సన్మానం

- 34 ఏళ్ల వైద్య సేవా ప్రస్థానానికి గౌరవ వందనం కమ్యూనిటీ హెల్త్ అధికారి హోదాలో పదవీ విరమణ
- లోటుపాట్లకు తావులేకుండా కార్యక్రమాన్ని ఆదర్శంగా నిర్వహించిన సిహెచ్ఓ రమేష్ రెడ్డి, ఎం.పి.హెచ్.ఓ సత్యనారాయణ.



**పోడూరు ఫిబ్రవరి 4 మనం న్యూస్ :** వైద్య వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా దైవసేవగా భావించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణే తన జీవిత లక్ష్యంగా 34 సంవత్సరాల పాటు వైద్య ఆరోగ్య శాఖలో వివిధ హోదాలలో నిర్విరామంగా సేవలందించిన కమ్యూనిటీ హెల్త్ అధికారి యిజ్జన వీరమ్మ బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమె సేవలకు గౌరవ వందనం చేస్తూ పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అభినందన కార్యక్రమం భావోద్వేగాల నడుమ ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమం సిహెచ్ఓ రమేష్ రెడ్డి, ఎం.పి.హెచ్.ఓ సత్యనారాయణల సమర్థ నాయకత్వంలో, ముందస్తు ప్రణాళికతో, ఎక్కడా లోటుపాట్లు లేకుండా అత్యంత క్రమబద్ధంగా సాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రతి అంశాన్ని సవ్యంగా అమలు చేస్తూ, కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా నిర్వహించిన తీరుకు హాజరైన వారందరూ ప్రశంసలు కురిపించారు.డాక్టర్లు డి. సుప్రజా, శ్రీ వాసవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరమ్మ - జిల్లెల్ల శ్యామసుందర రావు దంపతులను వైద్య ఆరోగ్య సిబ్బంది పూలమాలలు, బొకేలు, దుస్సాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. సేవామూర్తిగా నిలిచిన వీరమ్మకు పలువురు కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగంగా మాట్లాడారు.కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, యిజ్జన వీరమ్మ తన 34 సంవత్సరాల సేవా జీవితంలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆమె అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారుల మన్ననలు పొందిన ఆమె ప్రయాణం ప్రతి ఉద్యోగికి ఆదర్శమని పేర్కొన్నారు.డాక్టర్లు డి. సుప్రజా, శ్రీ వాసవి మాట్లాడుతూ, వీరమ్మ సేవలు వైద్య ఆరోగ్య శాఖ చరిత్రలో ఒక గౌరవప్రదమైన అధ్యాయమని, ఆమె పని తీరు నేటి తరం వైద్య సిబ్బందికి మార్గదర్శకమని అన్నారు. సేవాభావంతో పని చేసే ఉద్యోగులు సమాజానికి ఎంతటి మార్పు తీసుకురాగలరో వీరమ్మ జీవితం చాటిచెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని యిజ్జన వీరమ్మకు హృదయపూర్వక శుభాకాంక్షలుతెలియజేశారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ సుమంగళి సాగర్, సర్పంచ్ చెట్టు బత్తుల సువర్ణరాజు మాజీ సర్పంచ్ రుద్రరాజు సుజాత, రిటైర్డ్ సిహెచ్ఓ సత్యనారాయణ,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొని వీరమ్మకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# గ్రూప్ 2 ఫలితాలలో శ్రీ సూర్య విద్యార్థుల ప్రతిభ



**నరసాపురం, ఫిబ్రవరి 4 (మనం న్యూస్):** తాజాగా ప్రకటించిన ఏపీపీఎస్సీ గ్రూప్ 2 ఫలితాలలో స్థానిక శ్రీ సూర్య జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు శేరు తాతయ్య డిప్యూటీ తహశీల్దారుగా, గెద్దాడ చంద్రకళ ఏ.ఎస్.వో గా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొగల్తూరు మండలం పేరుపాలెం ఏటిమొండి గ్రామానికి చెందిన శేరు తాతయ్య, పాలకొల్లు మండలం చిట్టివాని గరువు గ్రామానికి చెందిన గెద్దాడ చంద్రకళ 2012-14 విద్యా సంవత్సరంలో నరసాపురం పట్టణంలోని శ్రీ సూర్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. డిగ్రీ అనంతరం గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యి విజయం సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల స్థాయిలో శ్రీ సూర్య విద్యా సంస్థల్లో అందించిన అత్యుత్తమ శిక్షణ తీసుకోవడంతోనే తమ లక్ష్యాలను సాధించడానికి మార్గం ఏర్పడిందని ఆ తర్వాత ప్రిపరేషన్ కు శ్రీ సూర్య కళాశాల శిక్షణ ఎంతగానో ఉపయోగ పడిందని తెలిపారు. తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రూపు పరీక్షలలో విజయం సాధించిన తమ కళాశాల పూర్వ విద్యార్థులు తాతయ్య, చంద్రకళలను శ్రీ సూర్య విద్యా సంస్థల చైర్మన్ ఘంటసాల సూర్యనారాయణ, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, అకడమిక్ అడ్వైజర్ బి. రామచంద్ర రెడ్డి, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఏఆర్ ఎస్ కుమార్, డాక్టర్ ఫాజిల్, డాక్టర్ కె. జానకిరామ్, ఎస్.వేణు, టి. కృష్ణగుప్తా, జె. సుబ్బారావు, యు. లక్ష్మీ కాంత్, పి. పుల్లారావు, అధ్యాపక బృందం, సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంకు పార్కింగ్ సమస్య

- పరిష్కరించడంలో విఫలమైన అధికారులు

**పాలకొల్లు, ఫిబ్రవరి 4,మనం ప్రతినిధి :** పశ్చిమగోదావరి జిల్లా లో పంచరామ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం కు పార్కింగ్ సమస్య పట్టుకుంది. ఎంతమంది అధికారులు వచ్చిన ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవస్థానం కు వెళ్లి ద్విచక్ర వాహనం కాని, కనీసం సైకిల్ కూడా పెట్టుకునే పరిస్థితి లేక భక్తులు గగ్గోలు పెడుతున్నారు. సైకిల్ పెట్టుకుందాం అన్న, మోటర్ సైకిల్ పెట్టుకుందాం అన్న గుడి వద్ద చిల్లర వ్యాపారులు బండ్లు అడ్డంగా పెట్టుకుని వెళ్ళనీయలేని దుస్థితి నెలకొంది.

**దేవస్థానం వద్ద చిల్లర వ్యాపారులను తరలించడంలో అధికారుల వైఫల్యం:**

శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద భక్తులు వాహనాలు పెట్టుకునేందుకు వీలు లేకుండా చిల్లర వర్తకుల సరుకుతో కూడిన తినుబండార బండ్లు అడ్డుగా పెట్టడంతో ఆ బండ్లను తీయమనలేక భక్తులు లోలోపల మదనపడుతూ అధికారులు వైఫల్యం వేలెత్తి చూపుతూ



విమర్శిస్తున్నట్లు తెలిసింది. ఈ గుడికి వచ్చిన ఈ తిప్పలు తప్పవు ఏమో అనుకుని ఎక్కడో ఉత్తరం వైపున చివర్న వాహనాలు పెట్టుకుని మళ్ళీ ఎదరకు వచ్చి గుడికి రావాల్సి వస్తుందని భక్తులు విమర్శిస్తున్నారు. అధికారులకు, చిల్లర వ్యాపారులంటే మోహమోటం దేనికని ప్రశ్నిస్తున్నారు. మోహమోటం ఉండడం వల్లే ఇలా వారిని నియంత్రణ చేయలేకపోతున్నారు ఏమో అని మరి కొందరు ఆరోపిస్తున్నారు. గుడికి వచ్చి విరాళాల రూపంలో ఆదాయం కల్పించే భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలా లేక చిల్లర వర్తకుల కు ప్రాధాన్యత ఇవ్వాలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. భక్తులకు ప్రాధాన్యత ఇచ్చే వారైతే భక్తుల వాహనాలు చివరకు పంపరని ఈ వర్తకుల్ని ఆ చివరకు పంపేలా చేసేవారిని అందరూ భక్తులు వ్యాఖ్యానిస్తున్నారు. దేవస్థానం కు ఉత్తరం వైపున మెయిన్ రోడ్ లో ఈ పరిస్థితి అయితే దేవస్థానం తూర్పు వైపున ఇరుకు సందులో కూడా ఇదే పరిస్థితి. సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు పెట్టుకునేందుకు వీల్లేకుండా చిన్నచిన్న దుకాణాలను పెట్టుకోవడానికి వీలు కల్పించడం వల్ల వాహందారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇది చాలదన్నట్లు బిక్ష గాళ్ళు అడ్డు ఒకటి.

**చిల్లర వర్తకులు,దుకాణాలు మెయిన్ రోడ్డు బిగ్సి ఎదురు గా దాటి రాకూడదు:**

శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ప్రస్తుతం ఉన్న పార్కింగ్ సమస్యను పరిష్కరించాలంటే తూర్పు వైపున చిన్న సందులో దేవస్థానం గోడ పక్కన చిన్న దుకాణాలను, అలాగే ఉత్తర వైపు మెయిన్ రోడ్ లో దేవస్థానం పక్కనే ఉన్న బండ్లు, పెట్టెలు, తట్టల వ్యాపారులు అందర్నీ కూడా బిగ్ సి షాపు ఎదురుగా తరలించాలని, తూర్పు వైపున దేవస్థానం ప్రహరీ గోడ పక్కన ఏమీ లేకుండా ఖాళీ చేయించాలని పలువురు భక్తులు సూచిస్తున్నారు. అధికారులు ఈ విధంగా చేసి భక్తులు పట్ల తమ శతశుద్ధిని నిరూపించుకోవాలని కోరుతున్నారు.

# గ్రంథాలయాలకు పూర్వవైభవం తెస్తాం



- పీరుకట్ల విఠల్ రావు
- రూ. 6 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4:** జిల్లాలోని గ్రంథాలయాలను విజ్ఞాన నిలయాలుగా తీర్చిదిద్ది, వాటికి పూర్వవైభవం తీసుకువస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు పీరుకట్ల విఠల్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2026-27 సంవత్సరానికి గాను రూ. 6 కోట్ల బడ్జెట్కు ఆమోదించి, తదుపరి పౌర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వారికి తదుపరి ఆమోదం కోసం పంపుతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా విఠల్ రావు మాట్లాడుతూ, గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కార్పొరేట్ తరహాలో వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పదేళ్లుగా పెండింగ్లో ఉన్న భవన మరమ్మతులు చేపట్టి, ఆకర్షణీయమైన రంగులతో గ్రంథాలయ రూపురేఖలు మారుస్తామన్నారు. చెదలు పట్టిన తలుపులు, పాత ఫర్నీచర్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు, పాఠకుల సౌకర్యార్థం ఆధునిక టాయిలెట్లు, స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ముఖ్యంగా నిధుల కొరత వల్ల పెండింగ్లో ఉన్న జీతభత్యాలు, పెన్షన్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని, సిబ్బంది నైతిక స్థైర్యాన్ని పెంచుతామని భరోసా ఇచ్చారు. జిల్లాలోని 44 శాఖా గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని ఆయన కొనియాడారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార పౌర సంబంధాల కె.చెన్నకేశవ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిజిఎస్ శంకర్ రావు, డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ రావు, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

# ఎలుకల నివారణకు విషపు ఎరువు రైతులు వినియోగించాలి



- వ్యవసాయ అధికారులు

**ఆచంట, ఫిబ్రవరి 4 మనం న్యూస్:** ఆచంట మండల పరిధిలోని అన్ని గ్రామాలలో రైతులందరూ ఎలుకలను సమూలంగా నాశనం చేసేందుకు ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేసే విషపు ఎరువు వినియోగించు కోవాలనిబుధవారం వ్యవసాయ అధికారులు పి మురళీకృష్ణ స్థానిక వ్యవసాయ అధికారి బి నాగరాజు అన్నారు ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు సాగుచేసిన పంట పొలాలు అధిక దిగుబడి పొందాలంటే రైతులు పలు సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు ఎలుకలను సమూలంగా నివారించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసే విషపు ఎరువు ప్రథమంగా 96% నూకలు రెండు శాతం నూనె మరియు రెండు శాతం గ్రోమోడయోలిన్ మందు కలిపి విషపు ఎరువును10 గ్రాములు చొప్పున పొట్లాలుగా చేసి ఎలుకల బొరియల్లో కి తరలిస్తే ఎలుకలు సమూలంగా నాశనం అవుతాయని వ్యవసాయా అధికారులు రైతన్నలకు పలు సూచనలు చేశారు ఈ ఫ్ట కార్యక్రమంలో ఆచంట వేమవరం సొసైటీ అధ్యక్షులు నెక్కంటి సత్యనారాయణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దొంగ నాగర్జున టిడిపి జనసేన బిజెపి కూటమి నాయకులు కార్యకర్తలు రైతన్నలు తదితరులు పాల్గొన్నారు.



# పరసా విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో సిసి రోడ్లు ప్రారంభించిన కామినేని

**ముదినేపల్లి, ఫిబ్రవరి 4 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ ముదినేపల్లి మండలం శ్రీహరిపురం గ్రామములో 36 లక్షల రూపాయిలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరస విశ్వేశ్వరరావు నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు , నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారి మారినా ఇంకా పాత పేర్లు తో బోర్డులు దర్శనం

**కాట్రేనికోన, ఫిబ్రవరి 4, మనం ప్రతినిధి:** కాట్రేనికోన ఎంపీడీఓ గా వెంకట చలం పదవి విరమణ జరిగి నూతనఎంపీడీఓ గా బి రాజేశ్వరరావు భాధ్యతలు చేపట్టి నెల రోజులు దాటి పోయింది. కానీ మండలం లోని పంచాయతీ కార్యాలయాలు, సచివాలయం ల వద్ద సమాచారం బోర్డు లలో ఇంకా పేర్లు మార్చలేదు. ఇప్పటికి పాత ఎంపీడీఓ పేరు తో బోర్డు లు దర్శనం ఇస్తున్నాయి. కొన్ని చోట్ల అసలు అధికారులు ఎవరో కూడా తెలియడం లేదని, సమాచార బోర్డు లు ఏర్పాటు చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. నూతన అధికారి పేరు, హోదా, సెల్ నెంబర్ తో సమాచారం బోర్డు లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. డిప్యూటీ ఎంపీడీఓ, సచివాలయం వ్యవస్థ పర్యవేక్షణ కు ప్రత్యేక అధికారి ని నియమించిన వారి వివరాలు సచివాలయం లలో ఎక్కడా కనిపించడం లేదు. సచివాలయం సిబ్బంది బదిలీ జరగడం తో కొత్త సిబ్బంది వచ్చినా మండలం లో సిబ్బంది కొరత గా ఉంది. ఆ సిబ్బంది వివరాలు కూడా ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. కొందరు మండల స్థాయి అధికారులు జీతాలు తీసుకుంటున్నారు కానీ మండలం లో పని చేసిన దాఖలాలు కనిపించడం లేదని,కేవలం సర్వ సభ్య సమావేశంలో మాత్రమే మొక్కి బడిగా కనిపిస్తూ ఉంటారని, అటువంటి అధికారులు పై నూతన ఎంపీడీఓ ద్రుష్టి సారిం చాలని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సమయ పాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

# అడవిలో బందీల విముక్తి ఆపరేషన్ విన్యాసం నిర్వహణ



**విశాఖపట్నం, ఫిబ్రవరి4:** నేషనల్ సెక్యూరిటీ గార్డ్ ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నంలో 02-05 ఫిబ్రవరి 2026 మధ్య విన్యాసాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ విన్యాసంలో వాస్తవ యుద్ధ పరిస్థితులను అనుకరించి, నక్సల్స్ ప్రస్తుత కార్యకలాప విధానానికి అనుగుణంగా వివిధ నైపుణ్యాలు, ఆపరేషనల్ వ్యూహాలు మరియు తంత్రాలను సమన్వయం చేస్తూ, యథార్థమైన మరియు తీవ్ర శిక్షణ వాతావరణాన్ని సృష్టించారు. ఈ విన్యాసం లక్ష్యం సంభవించే ముప్పులను ముందుగా అంచనా వేయడం, ప్రాంతంలో దృఢమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సమన్వయ ప్రక్రియలను సాధన చేయడం. ఈ విన్యాసంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలు ప్రథమ స్పందన దళాలుగా పాల్గొనగా, ఇఖ్కడ, ఐఖీఅ్క, ఖ్రీఖఊ, అటవీ శాఖ, అగ్నిమాపక, వైద్య మరియు గూఢచారి సంస్థల నుండి గణనీయమైన మద్దతు లభించింది. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన మరియు ప్రభావవంతమైన స్పందనకు అంతర ఏజెన్సీ సమన్వయం మరియు పరస్పర అనుసంధాన సామర్థ్యాన్ని ఈ విన్యాసం స్పష్టంగా చాటింది. అడవి యుద్ధ తంత్రాలు విన్యాసం పూర్తయిన అనంతరం, ఏఖ్ఖ పరిస్థితుల్లో ఉపయోగించిన ఆయుధాలు మరియు పరికరాల ప్రదర్శనను ఏర్పాటు చేసి, ఆధునిక ఆపరేషనల్ సాధనాలు మరియు వ్యూహాల వినియోగ సామర్థ్యంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ (ఆపరేషన్స్) డా. సుమిత్ గరుడ్, ఐపీఎస్ మాట్లాడుతూ, ాఖిఎ బృందం చేపట్టిన సమన్వయపూర్వక ప్రయత్నాలను ప్రశంసిస్తూ, ఈ విన్యాసం ద్వారా ాఖిఎ మరియు రాష్ట్ర పోలీస్ బలగాల మధ్య సమన్వయం మరింత బలోపేతం అయి, వాస్తవ కాల ముప్పులను ఎదుర్కొనే ఏకీకృత మరియు సమర్థమైన స్పందన వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు. ఇలాంటి విన్యాసాలు ఆపరేషనల్ సిద్ధతను మెరుగుపరచడమే కాకుండా, కీలక దశల్లో వేగవంతమైన మరియు సమగ్ర నిర్ణయాలు తీసుకునేలా స్పందన దళాలను శక్తివంతం చేస్తాయనిాఖిఎ పునరుద్ఘాటించింది. ఈ విన్యాసం ద్వారాాఖిఎ, గ్రేహౌండ్స్ మరియు ఆక్టోపస్ మధ్య సహకార సామర్థ్యం గణనీయంగా బలపడుతుందని, నక్సల్స్ లేదా ఉగ్రవాద సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో మరింత దృఢమైన మరియు ప్రభావవంతమైన స్పందనకు ఇది దోహదపడుతుందని, సంక్షోభ సమయాల్లో ప్రజల భద్రతను నిర్ధారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు

# ఐఎఫ్ఆర్-2026 నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**విశాఖపట్నం, ఫిబ్రవరి 04 :** అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష (ఐఊఖ-2026), మిలాన్, అంతర్జాతీయ సిటీ పరేడ్ కార్యక్రమాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇండియన్ నేవీ, పోలీసు, ఇతర విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కోస్ట్ గార్డు డీఐజీ రాజేష్ మిత్తల్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు, ఆర్డీవోలు, ఇతర అధికారులు భాగస్వామ్యమై వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి, రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు, రెండు నుంచి మూడు లక్షల వరకు ప్రజలు కూడా రానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మౌలిక



వసతుల కల్పన, వైద్య సేవలు అత్యంత సమర్థవంతంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 17న రాష్ట్రపతి రాకతో కార్యక్రమాలు మొదలవుతాయని, 18న నౌకాదళ ఫ్లీట్ రివ్యూ, 19న ఉదయం మిలాన్ ప్రారంభోత్సవం, సాయంత్రం ఆర్కే బీచ్ రోడ్డులో అంతర్జాతీయ సిటీ పరేడ్ ఉంటుందని, కార్యక్రమాలను వీక్షించేందుకు రెండు నుంచి మూడు లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున సమన్వయంతో పని చేయాలని సూచించారు. సిటీ పరేడ్ మార్గంలో ఎల్ఈడి స్క్రీన్లు, పీఏ సిస్టమ్, గ్యాలరీలు, బారికేడింగ్, పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదనంగా వీఎంఆర్డీఏ పార్క్, వైఎంసీఏ, ఏయూ ఫుట్బాల్ గ్రౌండ్లను హోల్డింగ్ ఏరియాలుగా వినియోగించకోవాలని సూచించారు. వైద్య, అగ్నిమాపక, తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, పరిశుభ్రత చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్ సుందరీకరణ, డెకరేటివ్ లైటింగ్, పరిశుభ్రత పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఫిబ్రవరి 17 నుంచి కంట్రోల్ రూమ్ పూర్తి స్థాయిలో పనిచేస్తుందని, అవసరమైతే వేదికల వద్ద ప్రత్యేక కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. నో-డ్రోన్, నో కైట్ జోన్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. పార్కింగు ప్రాంతాల్లో, ప్రముఖులు రాకపోకలు సాగించే ప్రధాన రహదారుల్లో లైటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. సమావేశంలో ఇండియన్ నేవీ, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాట్రేనికోనను వెంటాడుతున్న కరెంటు కష్టాలు

**కాట్రేనికోన, ఫిబ్రవరి 4, మనం ప్రతినిధి:** కాట్రేనికోన మండలానికి కరెంటు కష్టాలు తప్పడం లేదు. పల్లంకుర్రు లో సబ్ స్టేషన్ నిర్మాణ నిమిత్తం గడచిన మూడు నెలలుగా వారానికి రెండు రోజులు చొప్పున విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ సబ్ స్టేషన్ నిర్మాణ కష్టాలు పూర్తి అయ్యాయి అనుకునే లోపు కవర్ కండక్టర్స్ వర్క్ పేరుతో సరఫరా నిలిచిపోతుంది. 33 కే వి చెయ్యేరు నుండి కాట్రేనికోన లైన్ కవర్ కండక్టర్ వరక్స్ జరగటం వలన సరఫరాలో అంతరాయం కలుగుతుందని సంబంధిత శాఖ సిబ్బంది చెబుతున్నారు. మరో వా.రం రోజులు పాటు ఇదే పరిస్థితి కొనసాగు వచ్చునన్న మాటలు వీరి నుండి వినపడుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పై ఆధారపడి నడిచే పరిశ్రమలు, వ్యాపారాలు చతికలు పడుతున్నాయి.



# రెవిన్యూ పిర్యాదులను సకాలంలో పరిష్క రించాలి

- రీ సర్వే తప్పులను సరిదిద్దాలి
- రీ వెరిఫికేషను తరువాత పిర్యాదులు వస్తే కఠిన చర్యలు
- తప్పులు లేని పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలి
- నూరుశాతం నీటి తీరువా వసూలు చేయాలి
- జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



**అనకాపల్లి/చీడికాడ మనం బ్యూరో ఫిబ్రవరి 4:** రీ సర్వేలో వచ్చిన పిర్యాదు లపై రీ వెరిఫికేషను చేసి సరిచేసి తప్పులు లేని పట్టాదారు పాసుపుస్తకాలను ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తహశీల్దార్లను ఆదేశించారు. రీసర్వే, రీ వెరిఫికేషను, పి.జి.ఆర్.ఎస్., రెవిన్యూ క్లినిక్, పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ, నీటితీరువా, సివిల్ సప్లయి తదితర అంశాలపై కలెక్టరు కార్యాలయం నుండి తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో రెవిన్యూ సంబంధిత అంశాలపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రీసర్వే లో వచ్చిన పిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, రీ వెరిఫికేషను తరువాత పేరు, సర్వేనెంబరు, విస్తీర్ణం వివరాలలో తప్పులు లేని పాసుపుస్తకాలను భూయజమానులకు అందించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. రీ-వెరిఫికేషనులో క్షేత్ర స్థాయి అందికారులు పంపిన నివేదికలోని వివరాలను సరిచూసుకొని సంతృప్తి పొందిన తరువాత మాత్రమే తహశీల్దార్లు రిపోర్టు పంపించాలని, రీ-వెరిఫికేషను తరువాత భూసంబంధిత వివరాలు, పాసుపుస్తకాలలో తప్పులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పి.జి.ఆర్.ఎస్. మరియు రెవిన్యూ క్లినిక్ ద్వారా వచ్చే పిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, వివరాలను పిర్యాదుదారునికి తెలియజేయాలని, ఎండార్సుమెంటు కాపీ అందజేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు.

జిల్లాలో వివిధ విడతలలో చేపట్టిన రేసర్వే పనులు షెడ్యూలు ప్రకారం పూర్తిచేయాలన్నారు. రీ సర్వే సమయంలో రీ సర్వే, భూమి వివరాలను భూయజమానులకు తప్పని సరిగా తెలియజేయాలని, అందుకు అన్ని రకాల మార్గాలను వినియోగించుకోవాలన్నారు. రీ సర్వేలో ప్రభుత్వ భూముల వివరాలను తప్పని సరిగా రికార్డులలో నమోదుచేయాలని తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ పూర్తిచేయాలన్నారు. నీటి తీరువా వసూలు పూర్తిచేయాలని, గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించి శతశాతం చెల్లింపులు జరిగేలా వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. సివిల్ సప్లయికి సంబంధించి డిజిటల్ కార్డులన్నింటిని పంపిణీ పూర్తిచేయాలని, లక్ష్యం మేరకు రేషను షాపులు నెలవారీ తనిఖీలు చేయాలని, దీపం పథకానికి సంబంధించిన డబ్బులు పడని ఖాతాలకు డబ్బులు జమఅయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాపై కన్నేశాం

- హద్దు మీరితే చర్యలు తప్పవు
- ఐజీ అశోక్ కుమార్ హెచ్చరిక
- మహాశివరాత్రికి పటిష్ట బందోబస్తు
- సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా



**కాత్రేనికోన , ఫిబ్రవరి 04 (మనం ప్రతినిధి):** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తున్నారని, సోషల్ మీడియా వేదికగా అశాంతి రేకెత్తించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐజీ అశోక్ కుమార్ హెచ్చరించారు. ఆయన జిల్లా పర్యటనలో భాగంగా అయినవిల్లి, అమలాపురం పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పలు కీలక విషయాలను వెల్లడించారు.

## సమస్య చిన్నగా ఉన్నప్పుడే పరిష్కారం

ప్రజల సమస్యలు పెద్దవి కాకముందే వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఐజీ తెలిపారు. కోనసీమ సున్నితమైన ప్రాంతం కావడంతో జిల్లాలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగిస్తున్నామన్నారు.

## సోషల్ మీడియా అడ్మిన్లే బాధ్యులు

జిల్లాలో ఆవేశాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఉపేక్షించేది లేదని ఐజీ స్పష్టం చేశారు. గ్రూప్ అడ్మిన్లకు ఇప్పటికే నిబంధనలు తెలియజేశామని, పాత వీడియోలను షేర్ చేసి కొత్తగా సమస్యలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాను నిరంతరం ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

## మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు

రానున్న మహాశివరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకునేలా అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టామన్నారు. అంతర్వేది సహా ఇతర ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద భద్రత విషయంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను ఐజీ అభినందించారు.


## నేర నియంత్రణకు హైటెక్ నిఘా

జిల్లాలో పేకాట, కోడిపందేల వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నట్లు ఐజీ వెల్లడించారు. హై ప్రైయారిటీ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా చూస్తున్నామని చెప్పారు.

## సీనియర్ సిటిజన్లే టార్గెట్

సైబర్ నేరగాళ్ళు సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని, దీనిపై ప్రత్యేక టీమ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. బ్యాంక్ మేనేజర్లు కూడా అనుమానాస్పద లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే ఖాతాదారులతో మాట్లాడి క్రాస్ చెక్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అమలాపురం డి ఎస్పీ టి ఎస్ ఆర్ కె ప్రసాద్, సీఐలు ప్రశాంత్ కుమార్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# మురళీమోహన్‌కు గంటా అభినందన



**విశాఖపట్నం, మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 4:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ ప్రకటించిన ప్రముఖ సినీ నటుడు, నిర్మాత మాగంటి మురళీమోహన్ ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. హైదరాబాద్ లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ సినీరంగానికి సుదీర్ఘ కాలం సేవలందించిన మురళీమోహన్ కు పద్మశ్రీ ప్రకటించడం తెలుగు సినీ పరిశ్రమను గౌరవించుకోవడమేనన్నారు. క్రమశిక్షణకు మారుపేరైన మురళీమోహన్ ప్రస్థానం అందరికీ ఆదర్శనీయమని తెలిపారు.

# పర్యాటక మారేడుమిల్లిలో విషపు పొగల ముప్పు

- ఇళ్ల మధ్య డంపింగ్ యార్డ్
- ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం



**మారేడుమిల్లి మనం న్యూస్:** ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన మారేడుమిల్లి మండలంలో ఇళ్ల మధ్యనే డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డంపింగ్ చేసిన చెత్తను తరచూ కాల్చడం వల్ల ఏర్పడుతున్న విషపూరిత పొగ చుట్టుపక్కల నివాస ప్రాంతాల్లోకి వ్యాపించి ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ప్రత్యేకించి ఈ పొగ కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోస సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కాల్చే సమయంలో వచ్చే దుర్వాసన, పొగ వల్ల ఇళ్లలో ఉన్నవారికి కళ్ల మంటలు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శి, సర్పంచులకు ఈ సమస్యపై పంచాయతీ కార్మికులు ఇప్పటికే తెలియజేసినా, అదే ప్రాంతంలో చెత్తకు మంట పెట్టడం కొనసాగుతుండటం విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, దుకాణాల నుంచి వచ్చిన కాలం చెల్లిన కారం ప్యాకెట్లు, మసాలా ప్యాకెట్లు తదితరాలను అక్కడే పడవేయడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాల్సిన మారేడుమిల్లిలో ఈ తరహా నిర్లక్ష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, వెంటనే డంపింగ్ యార్డును నివాస ప్రాంతాల నుంచి తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పకడ్బందీగా ముఖ్యమంత్రి పర్యటన

- సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్



**కర్నూలు ఫిబ్రవరి 3(మనంబ్యూరో):** ఫిబ్రవరి 6వ తేదీన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటిస్తున్న నేపథ్యంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో ఫిబ్రవరి 6 వ తేది నిర్వహించనున్న పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వర్యులు పాల్గొననున్న నేపథ్యంలో హెలిప్యాడ్, ప్రజావేదిక తదితర ఏర్పాట్లను సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు కృష్ణమ్మ పరిశీలించారు.

ఈ సందర్భంగా సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తూ ఎంట్రన్స్ లో స్టాలల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా వేదిక ప్రాంగణంలో ఎక్కువ మంది రైతులు వచ్చే అవకాశం ఉన్నందున బ్యారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లు పై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. హెలిప్యాడ్, పార్టీ కార్యకర్తల సమావేశపు ప్రదేశాలను పరిశీలించారు అనంతరం హెలిప్యాడ్, రోడ్డు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ ఈ నెల 6 వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదోని ఇంచార్జి ఆర్డీఓజయ్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, డిపిఓ భాస్కర్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, పాల్గొన్నారు.

# 50 క్వింటాళ్లు పిడిఎస్ బియ్యం స్వాధీనం

**పోడూరు, ఫిబ్రవరి 4 (మనం న్యూస్):** పోడూరు మండలం కవిటం శివారు నల్ల వెంకయ్య చెరువు ఏరియాలోని గ్రంధి కేశవరావు కిరాణా దుకాణంలో 35 క్వింటాళ్లు, గ్రంధి నరసింహమూర్తి దుకాణంలో 15 క్వింటాళ్లు మొత్తం 50 క్వింటాళ్లు(5 టన్నులు) పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ ఎస్ పి కె. నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లా విజిలెన్స్ డిఎస్పి ఎస్. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎస్సై కె. సీతారాము బుధవారం సీజ్ చేశారు. రూ. 2 లక్షల విలువ గల బియ్యాన్ని సీజ్ చేశారు. వీరిద్దరిపై 6 ఎ, మరియు 71 ఈసి యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ కె. సీతారాము తెలిపారు. మండల సివిల్ సప్లై డిటి నాగదేవి, వీఆర్వో కుమార్ పాల్గొన్నారు.

# నిందితునికి ఒక ఏడాది ఎనిమిది నెలలు జైలు శిక్ష

**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి:** దొంగతనం కేసులో నిందితునికి ఒక ఏడాది ఎనిమిది నెలలు జైలు శిక్ష విధిస్తూ 11వ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఏ రమేష్ ఆదేశాలు జారీ చేశారు. అగనంపూడి కి చెందిన తాడిపూడి శంకర్ (40) ఇల్లు బద్దలు కొట్టడం మరి దొంగతనాలు చేస్తున్నందుకు న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.2019 ఆగస్టు 2న, బాధితురాలు రెబాక వద్దకు వెళ్లి, మరుసటి రోజు ఒక కార్యక్రమంలో పాల్గొని, తిరిగి వచ్చినప్పుడు, పగిలిన కిటికీలు , దొంగిలించబడిన బంగారు ఆభరణాలు కనిపించాయి. ఇ., అగనంపూడిలోని ఆమె ఇంట్లోని ఐరన్ సేఫ్లో ఎత్తు గొలుసు, చెవి స్టడ్స్, నెక్లెస్ చోరీకి గురికావడంతోబాధితురాలు యండ్ర సత్యవతి అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఈశ్వరావు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. సీనియర్ అసిస్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్ జేజే మృణాళిని దేవి ఐపీసీ సెక్షన్ 380 ఎన్ 411 కింద నేరాన్ని సహేతుకమైన సందేహం లేకుండా నిరూపించారు. దీంతో న్యాయమూర్తి ముద్దాయికి ఒక ఏడాది ఎనిమిది నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

## ఎవరూ మార్పులు చేయడానికి వీలు లేకుండా


# రాజముద్రతో భూ పాస్ పుస్తకాలు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



**అల్లూరి జిల్లా పాడేరు మనం ప్రతినిధి:** రైతులకు రీసర్వే ఆధారంగా ప్రభుత్వం రాజముద్రలతో పట్టాదారు పాసుపుస్తకాలు ఎవరూ మార్పు చేయడానికి వీలు లేకుండా అత్యధిక సాంకేతికతను జోడించి ఇవ్వడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. పాడేరు మండలం బొక్కెల గ్రామంలో మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెవెన్యూ అంశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. రెవెన్యూ అంశాలతో మన జీవితాలు చాలా ముడిపడి ఉంటాయని వాటిపై అవగాహన పెంచుకోవడం వలన సమస్యలను త్వరగా పరిష్కరించుకోడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి రైతుకు తనకు ఉన్నటువంటి భూమికి సంబంధించి యూనిక్ నెంబర్ క్యూఆర్ కోడ్ తో ఈ పాస్ పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరికి మీ పాసుపుస్తకం పై ఉన్న క్యూఆర్ కోడ్ గానీ యూనిట్ నెంబర్లు గాని ఉండవని అది మీ ఒక్కరికే ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వెంటనే రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి అవి సరి చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రీ సర్వే చేసి ప్రభుత్వమే నేరుగా మీ ఇంటి వద్దకు వచ్చి పాస్ పుస్తకాలు అందించడం శుభ పరిణామం అన్నారు. పట్టాదారు పాసు పుస్తకాల్లో ఎటువంటి తప్పిదాలు జరగకూడదని రైతుల పేర్లు దోషాలు ఉండడానికి వీలులేదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని దీనివలన మరింత నిర్దిష్టంగా రి సర్వే చేయడం పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, పిఎసిఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రేగం కొండబాబు, మాజీ ఎంపీటీసీ బడ్నైని రాంబాబు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కించ వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ,రైతులు మండల తహసీల్దార్ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అమెరికా అధ్యక్షుని 'ప్రెసిడెంట్స్ వాలంటీర్ సర్వీస్ అవార్డు' ప్రదానం



**అమరావతి, ఫిబ్రవరి 4:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి శ్రీ కొండపల్లి శ్రీనివాస్ కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారం వరించింది. వాషింగ్టన్ డీసీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ వ్యాపార ప్రతిపాదన సంస్థ యూ.ఎస్-ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ మంత్రి విశేష సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని ప్రకటించింది. యూ.ఎస్-ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ వాషింగ్టన్ డీసీలో ప్రధాన కార్యాలయం కలిగిన ఒక లాభాపేక్షలేని సంస్థ. ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కోసం ఈ కౌన్సిల్ కృషి చేస్తోంది. యూ.ఎస్-ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ సీఈఓ ప్రెసిడెంట్ ఎలీషా బి. పులివర్తి, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు అమెరికా అధ్యక్షుని పేరుతో ఇచ్చే 'ది ప్రెసిడెంట్స్ వాలంటీర్ సర్వీస్ అవార్డు' ను అందజేశారు. రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమల బలోపేతం, మహిళా నేతృత్వంలోని పరిశ్రమలకు ప్రోత్సాహం, సెర్ప్ ద్వారా గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాల పెంపు, స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్తో అనుసంధానం చేయడం కోసం చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రధానం చేశారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం

రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం యూ.ఎస్-ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా అమెరికాలోని పెట్టుబడులను, సాంకేతికతను ఆంధ్రప్రదేశ్కు తీసుకురావడానికి, ఎన్ఆర్ఐల భాగస్వామ్యాన్ని పెంచడానికి మార్గం సుగమం కానుంది. ఈ కార్యక్రమంలోయూ.ఎస్-ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ సిఈఓ/ప్రెసిడెంట్, ఎలీషా బి. పులివర్తి, వైస్ చైర్మన్ కె. శ్రీహరి, ఆంధ్రప్రదేశ్ ఎం.ఎస్.ఎమ్.ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సీఈఓ విశ్వ మనోహరన్, ప్రధాన సాంకేతిక సలహాదారు డాక్టర్ ఎమ్. శ్రీనివాస శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ, అనుబంధ శాఖల అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించండి

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్తో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు భేటీ

**అమరావతి, ఫిబ్రవరి 04:** 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, ముందస్తుగా బడ్జెట్ కూర్పుపై రాష్ట్ర వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారు, ఆర్థిక శాఖ మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ గారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రైతన్నలకు బలమైన అండగా నిలిచేలా వ్యవసాయ, అనుబంధ శాఖల అభివృద్ధికి, అలాగే రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత ప్రోత్సహించే దిశగా వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖలకు అవసరమైన నిధుల కేటాయింపులపై సుదీర్ఘంగా చర్చించారు.



రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకత వృద్ధి, ఆధునిక సాంకేతికత అమలు, పశుసంవర్ధక రంగ విస్తరణ వంటి అంశాలకు బడ్జెట్లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా వ్యవసాయ, అనుబంధ శాఖల పరిధిలో ముఖ్యమైన కార్యాలయ భవనాలు, మౌలిక వసతుల నిర్మాణం, కొనసాగుతున్న మరియు ప్రతిపాదిత ప్రాజెక్టుల అమలుకు అదనపు నిధులు అవసరమని వివరించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల కోసం అదనపు బడ్జెట్ కేటాయింపులు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఈ విజ్ఞప్తిపై ఆర్థిక మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ గారు సానుకూలంగా స్పందిస్తూ, రైతు సంక్షేమం, వ్యవసాయ, పశుసంవర్ధక రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తుందని భరోసా ఇచ్చారు. రాబోయే బడ్జెట్లో ఈ రంగాలకు తగిన నిధులు కేటాయించే దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పొందూరు ఖద్దరుకు మహర్దశ.. రూ. 100 కోట్లతో క్లస్టర్ యూనిట్

- స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కూన రవికుమార్
- వేలాది మందికి ఉపాధి లక్ష్యంగా భారీ ప్రాజెక్టు



**పొందూరు, ఫిబ్రవరి 4:** పొందూరు ఖద్దరుకు ఉన్న చారిత్రక విశిష్టతను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ స్పష్టం చేశారు. సుమారు రూ. 100 కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు కానున్న ఈ క్లస్టర్ యూనిట్ ద్వారా ఆ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఖాదీ-ఖద్దర్ క్లస్టర్ యూనిట్ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. నియోజకవర్గ పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పొందూరు ఖద్దరుకు గ్లోబల్ గుర్తింపు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, 'జీఐ' ట్యాగ్ సాధించడంలో కీలక పాత్ర పోషించామని గుర్తుచేశారు. ఇప్పుడు రూ. 100 కోట్లతో ఏర్పాటు చేయనున్న క్లస్టర్ ద్వారా ఆధునిక సాంకేతికతను జోడించి ఖాదీ ఉత్పత్తుల తయారీ, శిక్షణ, మార్కెటింగ్లను ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నట్లు వివరించారు. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే వేలాది మంది స్థానిక మహిళలకు, కార్మికులకు, యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. స్థల విస్తీర్ణం, మౌలిక సదుపాయాలు, విద్యుత్, నీటి వసతులు, రహదారి అనుసంధానంపై అధికారులతో సమీక్షించిన ఆయన, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగానే ఈ క్లస్టర్ మంజూరైందని, ఇది స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త గుర్తింపునిస్తుందని స్పష్టం చేశారు. క్లస్టర్ యూనిట్ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ విభాగం ఉన్నతాధికారులు, కూటమికి చెందిన స్థానిక నాయకులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మోహన్ బాబు యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలి

- దేవనకొండలో విద్యార్థి, యువజన సంఘాల నాయకుల డిమాండ్



**దేవనకొండ, ఫిబ్రవరి 4, ( మనం న్యూస్):** అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని, యూనివర్సిటీలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని తిరుపతి కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు పిలుపునిచ్చిన విద్యార్థి సంఘాల నేతలను మోహన్ బాబు యూనివర్సిటీ బౌన్సర్లు కిడ్నాప్ చేసి దాడి చేయడం అమానుషమని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కె.భాస్కర్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు మహేంద్ర, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎం. రామాంజనేయులు లు తీవ్రంగా ఖండించారు. బుధవారం స్థానిక హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం నందు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తిరుపతి జిల్లాలో మోహన్ బాబు యూనివర్సిటీ లో జరుగుతున్న అవినీతి అక్రమాలు ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యార్థి సంఘాలైన అఐఖిఊ,ఖిఊఐ,ౄఖ్ఫిఐ సంఘాల నాయకులు యూనివర్సిటీ లో జరిగిన అవినీతిపై అవకతవకలపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘ నేతలను మోహన్ బాబు యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లు అడ్డుకొని కొట్టి కిడ్నాప్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కిడ్నాప్ కి పాల్పడిన మోహన్ బాబు యూనివర్సిటీ పై చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోహన్ బాబు యూనివర్సిటీలో విద్యార్థుల నుండి 26 కోట్ల రూపాయలను అధికంగా ఫీజులు వసూలు చేశారని వారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా కమిషన్ స్పష్టం చేస్తూ అక్రమంగా వసూలు చేసిన 26 కోట్ల రూపాయలను వెంటనే పేద విద్యార్థులకు చెల్లించాలని, విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా నిలిపివేయడంపై మోహన్ బాబు యూనివర్సిటీ పై 16 లక్షల జరిమానా విధించిందన్నారు. అయినప్పటికీ మోహన్ బాబు యూనివర్సిటీలో ఫీజుల దోపిడీ ఆగలేదన్నారు. దీంతో విద్యార్థి సంఘాలైన అఐఖిఊ, ఖిఊఐ,ౄఖ్ఫిఐ సంఘాల నాయకులు తిరుపతి కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారని కలెక్టర్ కార్యాలయం కూత వేటు దూరంలో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘ నాయకుడైన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ విద్యార్థి సంఘం నాయకులు వినోద్ లను నిర్బంధించి మోహన్ బాబు యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లు, గుండాలు దాదాపుగా 40 మంది కార్లలో వచ్చి, ద్విచక్ర వాహనాన్ని పడదోచి వారిని కొట్టి కార్లో బలవంతంగా ఎక్కించుకొని కిడ్నాప్ చేయడం జరిగిందన్నారు.

మోహన్ బాబు యూనివర్సిటీ బౌన్సర్ల దురాగతాలను తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. భవిష్యత్తులో విద్యార్థి సంఘం నాయకులకు హాని కలిగితే మోహన్ బాబు యూనివర్సిటీ పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకరు ఒకరు తిట్టుకుంటుంటే ప్రైవేట్ శక్తులు చట్టాన్ని అతిక్రమిస్తూ శాంతి భద్రతలను విఘాతం కలిగిస్తున్నాయన్నారు. దౌర్జన్యాలు, బెదిరింపులు, కిడ్నాప్ లతో చట్టాన్ని అతిక్రమిస్తున్నాయన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు యూనివర్సిటీలలో లోపాలను అక్రమాలను ఏమాత్రం పట్టించుకోకుండా రెడ్బుక్ రాజ్యాంగాన్ని చేతులతో పట్టుకొని తిరుగుతున్నారన్నారు. మోహన్ బాబు యూనివర్సిటీ అక్రమాలపై నారా లోకేష్ గారికి తెలియజేసినప్పటికీ పట్టించుకో కపోవడం బాధాకరమన్నారు. మోహన్ బాబు యూనివర్సిటీల వంటి ప్రైవేట్ యూనివర్సిటీల ఆగడాలు రోజురోజుకి మితిమీరిపోతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ సంఘటనపై స్పందించాలన్నారు. ఫీజుల అక్రమాల దోపిడీని అరికట్టాలి, విద్యార్థి నేతలను కొట్టి కిడ్నాప్ చేసిన బౌన్సర్లను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాల తరపున పెద్ద ఎత్తున దశల వారీగా ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు నరేష్, మహేష్, చిన్నరాయుడు, రాము,రాముడు, నారాయణ, హరి, శివ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనను విజయవంతం చేయాలి



- నందవరం మండల టీడీపీ నాయకులు

**నందవరం, ఫిబ్రవరి 4 మనం న్యూస్:** నందవరం మండలంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కన్వీనర్ ఖాసీంవలి వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి 6వ తేదీన కర్నూలు జిల్లాలోని కలుగొట్ల గ్రామంలో పర్యటించనున్నారని, ఈ పర్యటనను కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రాజముద్రతో కూడి పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులను పంపిణీ చేయడానికి ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఎమ్మిగనూరు మండల పరిధిలో గల కలుగొట్ల గ్రామానికి రానున్నారని తెలిపారు. ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి గారి సారధ్యంలో సీఎం పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నార్నారు. గతంలో జగన్ రైతులకు ఆస్తుల పట్టాపుస్తకాలపై తన ఫోటో వేసుకుని రాక్షస ఆనందం పొందాడని, కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేసి రాజముద్రతో పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తోందని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు గారి పర్యటన విజయవంతం చేయడానికి నందవరం మండలంలోని కూటమి నాయకులు, కార్యర్తలు, నందమూరి అభిమానులు, రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యకర్తంలో నందవరం మండల టీడీపీ సీనియర్ నాయకులు వెంకట్రామిరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, మిట్టసోమాపురం వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుడు మృతి



**మహానంది, ఫిబ్రవరి 4(మనంన్యూస్):** మహానంది మండలం పుట్టుపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు పెద్ద నాగన్న అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, ఏ ఐ టి యూ సి జిల్లా నాయకులు మురళీధర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు ప్రతాప్ సిపిఐ మండల కార్యదర్శి సామెల్, సిపిఐ నాయకులు రిటైర్డ్ టీచర్ రాజా, రైతు సంఘము జిల్లా నాయకులు రాజు,గురుమూర్తి, అబ్బిపురం తుపాకుల వెంకటేష్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు ముత్తుజాబి పుట్టుపల్లి గ్రామం సిపిఐ నాయకురాలు వెంకటమ్మ,దస్తగిరి తదితరులు పాల్గొని మృతదేహం పై ఎర్ర జెండా కప్పి నివాళులు అర్పించారు.

## జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోనికి తీసుకువెళ్ళాలి

- స్థానిక సంస్థ ఎన్నికలలో పోటీకి జనసేన నాయకులు సిద్ధంగా ఉండలి
- మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జ్ వాల్మీకి బి. లక్ష్మన్న



**మంత్రాలయం, ఫిబ్రవరి 4,మనం న్యూస్:** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోనికి తీసుకువెళ్ళాలని మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జ్ , రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ అధ్యక్షులు బి. లక్ష్మన్న పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకడబూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ ముఖ్య నాయకులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసేన పార్టీ సిద్ధాంతాలను, ప్రజల్లోకి తీసుకువెళ్లాలి ,జనసేన పార్టీని బలోపేతం చేసేందకు ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు.రాబోవు స్థానిక సంస్థ ఎన్నికలలో జనసేన పార్టీ తరఫున పోటీ చేయడానికి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్ కృషితోనే రాష్ట్రంలోనూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్డీఏ కూటమి ఏర్పడడానికి కే .పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఉంది కనుక రుణాంధ్రప్రదేశ్ నుంచి స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా అభివృద్ధి దిశలో పరుగులు పెడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో జనసేన పార్టీ పెద్దకడబూరు మండల అధ్యక్షులు జి బజారి, సింగిల్ విండో డైరెక్టర్ ఎస్ హనుమేష్, మండల ఉపాధ్యక్షులు రెడ్డి అలీ భాష, చెన్నారెడ్డి, సయ్యద్, గౌస్, ప్రభుదాస్, తా ఎన్న, జయపాల్, సుందరం, ఆంజనేయ, ఈరన్న, ఆనంద్, పవన్, వీరేష్, మహాదేవప్ప, సూరి,నరసింహులు, బొజ్జప్ప,మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఆహ్వానం



**మహానంది, ఫిబ్రవరి4,మనంన్యూస్:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగే ఉత్సవాలకు రావాలని శ్రీశైలం నియోజక వర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కి బుధవారం మహానంది దేవస్థానం ఈఓ శ్రీనివాస రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు.వేదపండితులు రవిశంకర్ అవధాని,నాగేశ్వర శర్మ, ప్రధాన అర్చకులు అర్జున్ శర్మ,ఉప ప్రధాన అర్చకులు జనార్ధన్ శర్మ,శంకరయ్య, ఏ ఈఓ మధు,సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, తదితరులు వున్నారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు



**మహానంది, ఫిబ్రవరి4,మనంన్యూస్:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సూర్యనంది క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నందిపల్లె తెలుగుదేశం పార్టీ నాయకులు మహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ నెల 15 నుండి జరిగే ఉత్సవాలలో భాగంగా యువకులకు కబ్బడి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాహన దారులు ఇబ్బంది పడకుండా రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ కార్యకర్త మౌలాలి, తదితరులు వున్నారు.

## క్యాన్సర్ నియంత్రణకు అవగాహనే ఆయుధం

- క్యాన్సర్ దినోత్సవంలో మంత్రి టీజీ భరత్
- అప్రమత్తంగా ఉంటే ఒక్క ఇంజెక్షన్తో క్యాన్సర్ నయం



**కర్నూలు, ఫిబ్రవరి 4(మనం న్యూస్):** క్యాన్సర్ నియంత్రణకు అవగాహనే ప్రధాన ఆయుధమని, ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ను పూర్తిగా అదుపులోకి తీసుకురావచ్చని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ అన్నారు. బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బచ్చు జానకిరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పారిశుద్ధ్య కార్మికులకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, ముందస్తు పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా 9 నుండి 14 ఏళ్ల కార్మికుల పిల్లలకు క్యాన్సర్ నిరోధక టీకాలు వేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రాణాంతక వ్యాధులపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. క్యాన్సర్ భయం కాకుండా జాగ్రత్త అవసరమని, ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం చేయించుకోవాలని మంత్రి సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, వ్యాయామం ద్వారా ఈ వ్యాధి ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద వైద్య సంస్థలు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. **మేయర్ మాట్లాడుతూ..** స్వచ్ఛతలో నగరాన్ని టాప్ 5లో ఉంచడం మంత్రి టీజీ భరత్తోనే సాధ్యం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండి వైద్యుల సూచనలు పాటిస్తే కొంతమంది క్యాన్సర్ నుంచి ఒకే ఇంజెక్షన్తో రక్షణ పొందే అవకాశముందని చెప్పారు. **కమిషనర్ మాట్లాడుతూ..** నగర స్వచ్ఛతలో పారిశుద్ధ్య కార్మికుల శ్రమను గుర్తించి బచ్చు జానకిరాం ఫౌండేషన్ వారు రూ.2,500 విలువైన క్యాన్సర్ నిరోధక టీకాను కార్మికుల పిల్లలకు ఉచితంగా ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్మికుల సంక్షేమానికి, ఆరోగ్య భద్రతకు తాము అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. బచ్చు జానకిరాం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.రవీంద్ర బాబు, బి.సాయివాణి మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సులో తమవంతు సామాజిక బాధ్యతగా అనేక కార్యక్రమాలు చేపట్టామని, క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఒక్కొక్కటి రూ.2,500 విలువైన హెచ్పీవీ క్యాన్సర్ నిరోధక టీకాలను ఇప్పుడు ఒకసారి, ఆరు నెలల తర్వాత మరోసారి వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సర్వేలను వేగవంతం చేయాలి



- ఎంపీడీవో గోపికృష్ణ

**జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 4 (మనం న్యూస్):** జూపాడుబంగ్లా మండలంలోని అన్ని గ్రామాలలో కుటుంబ సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో గోపికృష్ణ, తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 12371 కుటుంబాలు కలవని. ఇందులో 8535,కుటుంబ లు సర్వే చేయడం జరిగిందని. ఇప్పుడు మన పర్సంటేజీ 69.55% పూర్తి చేసి మన మండలం ప్రధానమ స్థానంలో ఉన్నదని. మిగతా 30. 45% అనగా 3736, కుటుంబాలకు సర్వే నిర్వహించాల్సి ఉందని. ఈ సర్వే ను ఫిబ్రవరి 15 వ తారీకు లోగా పూర్తి చేసి పంపాలని. ఇందుకు ప్రతి ఒక్క గ్రామంలోని సచివాలయ సిబ్బంది కూడా ఈ సర్వేలో పాల్గొని కుటుంబ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన తెలియజేశారు.

## ప్రజాఆరోగ్యానికి ఆయుర్వేదం..దివ్య ఔషధం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర



**తుగ్గలి ఫిబ్రవరి 4(మనం న్యూస్ ):** ప్రజాఆరోగ్యమే శ్రీరామరక్షని కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. బుధవారం తుగ్గలి శ్రీరాముల దేవాలయ ఆవరణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర ఆధ్వర్యంలో శ్రీ ఆది శివ ఆయుర్వేదిక్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంప్లో పలువురికి ఉచిత పరీక్షలు, వైద్య సేవలు అందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య పరిరక్షణకు,రోగ నిరోధక శక్తి పెంపదలకు ఆయుర్వేదం తోడ్పడుతుందని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆది శివ ఆయుర్వేదిక్ వైద్య కళాశాల సిబ్బంది, పాల్గొన్నారు.

## 12న మహానందికి ప్రభుత్వ సలహాదారులు



**మహానంది, ఫిబ్రవరి4 (మనంన్యూస్):** ప్రవచన చక్రవర్తి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, పూజ్యులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఈ నెల12న మహానంది క్షేత్రానికి వస్తున్నట్లు ఈఓ శ్రీనివాస రెడ్డి, వేదపండితులు రవిశంకర్ అవధాని లు బుధవారం తెలిపారు.మహానంది దేవస్థానం ప్రాంగణంలోని నూతనంగా కర్నూలు వాస్తవ్యులు పోగుల మహేశ్వరరెడ్డి చంద్రశేఖరమ్మ గార్ల సహకారంతో షుమారు 30 లక్షల ఖర్చుతో తీర్చిదిద్దబడిన కళావేదిక సభా ప్రాంగణాన్ని ప్రారంభించి అందులో తొలి కార్యక్రమం చాగంటి వారి ప్రవచనాలు వినిపించేలా ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రత్యేక కార్యక్రమాన్ని ఈఓ శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.00 గంటల నుండి గురువుగారి ప్రవచనం జరుగుతుందన్నారు. నందీశ్వర వైభవం గురించి వారు ఉపన్యసిస్తారు.కావున యావన్మంది విశేషంగా తరలివచ్చి పాల్గొనాలని కోరారు.

## ఫెర్టిలైజర్స్ యాప్ వలన రైతులకు మేలా? డీలర్లకు మేలా?

- డీలర్ యూరియా బ్యాగులను అప్లోడ్ చేసిన పది నిమిషాలలో నో స్టాకు చూపెడుతుంది
- చిన్న సన్నకారు రైతులకు దొరకని యూరియా
- యాప్ వలన డబ్బులు దండుకుంటున్న డీలర్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు





**కోదాడ, ఫిబ్రవరి 04(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ భూమిలో యూరియా వేయడానికి గతంలో పిఎసిఎస్ ద్వారా డీలర్ల ద్వారా యూరియాని కొనుగోలు చేసేవారు. ఆ సమయంలో చిన్న సన్నకారు రైతుల నుంచి పెద్ద రైతుల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాని తెచ్చుకొని పంట పొలాలలో వేసుకునేవాళ్లు. ఈమధ్య కాలంలో ఫెర్టిలైజర్స్ యాప్ ను గవర్నమెంట్ అమల్లోనికి తీసుకువచ్చింది. ఈ యాప్ వలన చిన్నా సన్నకారు రైతులే కాకుండా చదువుకొని రైతులు యాప్ ద్వారా యూరియా కట్టలు తీసుకోవాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ యాప్ ను ఎలా వాడాలో రైతులకు అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలం చెందారని పలువురు రైతులు వాపోతున్నారు.

### ఫెర్టిలైజర్స్ యాప్ వలన రైతులకు మేలా? డీలర్లకు మేలా?

ఫెస్టిలైజర్స్ యాప్ వలన రైతులకు ఎలాంటి మేలు జరగటంలేదని డీలర్లకే ఈ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు రైతులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిని దృష్టిలో పెట్టుకొని వీలైనంత త్వరలో ఈ యాప్ బాధనుండి చిన్న సన్న కారు రైతులను కాపాడాలని వాపోతున్నారు. డీలర్ యూరియా బ్యాగులను అప్లోడ్ చేసిన పది నిమిషాలలో నో స్టాకు చూపెడుతుంది. డీలరు తనకు వచ్చిన యూరియా బ్యాగులను యాప్ లో అప్లోడ్ చేసిన పది నిమిషాలలో నో స్టాక్ అని చూయించుతుందని పలువురు రైతులు వాపోతున్నారు. ఇక్కడ డీలర్లు ఏమైనా అవకతవకలు చేస్తున్నారా లేకపోతే ఇంకేమైనా కొత్త రకంగా ఆలోచిస్తున్నారా మాకైతే తెలియటం లేదు కానీ ఎప్పుడు చూసినా యాప్ లో నో స్టాక్ అనే చూయించుతున్నాయి అని రైతులు వాపోతున్నారు.

### చిన్నసన్నకారు రైతులకు దొరకని యూరియా

ఎప్పుడు డీలర్ల వద్దకెళ్లిన ట్రాక్టర్లకు ట్రాక్టర్లు యూరియా బయటకు పోతుంది కానీ మాకు మాత్రం యూరియా దొరకటం లేదు ఏమిటి అని డీలర్ ని అడిగితే వాళ్ళు యాప్ లో బుక్ చేసుకున్నారు తీసుకెళ్తున్నారు అంతేకానీ మాకు ఎలాంటి సంబంధం లేదు అని సమాధానం చెప్పి దాటవేస్తున్నారు. కళ్ళముందే యూరియా లోడ్ దిగుతుంది కానీ వాటిని తీసుకోవాలంటే చిన్న సన్న కారు రైతుజూంనానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. యూరియా తీసుకపోయే వారికి యాప్ ఎలా బుక్ అవుతుంది మాకు ఎందుకు బుక్ కావట్లేదు అనే సందేహం రైతులలో బలంగా నాటుకుపోయింది.

### యాప్ వలన డబ్బులు దండుకుంటున్న డీలర్లు

డీలర్లే ఎక్కువ పొలం ఉన్న పెద్ద రైతుల వద్ద నుండి డేటాను సేకరించి వారితో యూరియా బ్యాగ్ కి 300 నుండి 350 రూపాయల వరకు రేటు మాట్లాడుకుని డీలర్లే యాప్ లో బుక్ చేసి రైతుల వద్ద నుండి డబ్బులు దండుకుంటున్నారని పలువురు రైతులు వాపోతున్నారు.

### పట్టించుకోని సంబంధిత అధికారులు

చిన్న సన్నకారు రైతులు ఇప్పటికే పంటపై వేల రూపాయలు పెట్టుబడి పెట్టి ఈ యాప్ ద్వారా యూరియా తీసుకోలేక నానా ఇబ్బందులు పడుతున్న, డీలర్లు యాప్ లలో వారే బుక్ చేస్తున్న అధిక రేట్లకు యూరియాను సరఫరా చేస్తున్న సంబంధిత అధికారులు మాకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు.

### వ్యవసాయ అధికారిని చర్వాణి ద్వారా వివరణ అడగగా

జిల్లాలో ఏ డీలర్ కాడైనా స్టాక్ అప్లోడ్ చేసిన ఏడు నిమిషాల నుండి పది నిమిషాలలో స్టాక్ అయిపోతున్నది ఎలాంటి అవకతవకలకు తావు లేదు. రైతు వేదికల వద్దకు వచ్చిన రైతులకు పిఎసిఎస్ వద్దకు వచ్చిన రైతులకు యాప్ గురించి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. డీలర్లు వద్ద నుండి తీసుకెళ్తున్న యూరియాకు రైతులు ఎంఆర్పి రేటే చెల్లించాలని తెలిపారు.



## ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ డేట్ : రికార్డులు తిరగ రాసేందుకు డేట్ ఫిక్స్..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. దర్శకుడు హరీష్ శంకర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు భారీగా క్రియేట్ అయ్యాయి. ఈ కాంబినేషన్ లో వచ్చిన 'గబ్బర్సింగ్' ఇండస్ట్రీ హిట్ గా నిలవడంతో ఇప్పుడు మరోసారి ఆ మ్యాజిక్ 'ఉస్తాద్ భగత్ సింగ్'తో రిపీట్ చేస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, ఈ సినిమా రిలీజ్ డేట్ కు సంబంధించి మేకర్స్ తాజాగా ఓ క్లారిటీ ఇచ్చారు.

'ఉస్తాద్ భగత్సింగ్' చిత్రాన్ని గతంలో వాయిదా వేశారు. దీంతో ఇప్పుడు ఈ చిత్రాన్ని మార్చి 26, 2026లో రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. దీనికి సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్ ను వారు రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో పవన్ తనదైన వింటేజ్ పోజ్ లో కనిపిస్తున్నారు. ఇక పవన్ లుక్స్ ఆకట్టుకునేలా ఉండటంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అభిమానులు ఆతృతగా చూస్తున్నారు. ఈ సినిమాలో పవన్ ఓ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. ఆయన సరసన అందాల భామలు శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇక మార్చి 26న రిలీజ్ కానున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తాడో చూడాలి.

### వరల్డ్‌కప్ ఫైనల్‌కు
# దూసుకెళ్లిన భారత్



ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్ టోర్నీ-2026లో భారత యువ జట్టు ఫైనల్ కు దూసుకువెళ్లింది. హరారే వేదికగా సెమీ ఫైనల్లో అఫ్గనిస్తాన్ ను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. జింబాబ్వే వేదికగా జనవరి 15న ప్రపంచకప్ టోర్నీ మొదలైన విషయం తెలిసిందే.

ఆది నుంచి అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్న భారత జట్టు.. సూపర్ సిక్స్ దశలో నాలుగింటికి నాలుగు మ్యాచ్ లు గెలిచి సత్తా చాటింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ ను ఓడించి సెమీస్ లో అడుగుపెట్టింది. ఈ క్రమంలో రెండో సెమీ ఫైనల్లో బుధవారం అఫ్గన్ జట్టుతో తలపడింది.ఇద్దరు శతకాలు బాది

హరారేలో టాస్ ఓడిన భారత్ తొలుత బౌలింగ్ చేసింది. అయితే, వికెట్లు తీయలేక భారత బౌలర్లు ఆపసోపాలు పడ్డారు. అఫ్గన్ బ్యాటర్లలో ఫైజల్ షినోజాదా (110), ఉజైరుల్లా నియాజాయ్ (101 నాటౌట్) శతకాలతో చెలరేగి.. అఫ్గన్ ను పటిష్ట స్థితిలో నిలిపారు.

వీరిద్దరి అద్భుత ప్రదర్శన కారణంగా నిర్ణీత 50 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి అఫ్గనిస్తాన్ 310 పరుగుల భారీ స్కోరు సాధించింది. వరల్డ్ కప్ తాజా ఎడిషన్ లో ఇదే అత్యధిక స్కోరు. ఈ క్రమంలో 311 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆయుశ్ మాత్రే సేన ఆది నుంచే దూకుడుగా ఆడింది.

#### శతక్కొట్టిన హైదరాబాదీ బ్యాటర్

ఓపెనర్లలో వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 68) ధనాధన్ దంచికొట్టగా... హైదరాబాదీ బ్యాటర్ ఆరోన్ జార్జ్ శతకం (104 బంతుల్లో 115; 15 ఫోర్లు, 2 సిక్సు)తో సత్తా చాటాడు. వన్ డౌన్ లో వచ్చిన కెప్టెన్ ఆయుశ్ మాత్రే 59 బంతుల్లో ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లు బాది 62 పరుగులు సాధించాడు.

మిగతా వారిలో విహాన్ మల్హోత్రా (47 బంతుల్లో 38), వేదాంత్ త్రివేది (6 బంతుల్లో 5) అజేయంగా నిలిచి భారత్ గెలుపును ఖరారు చేశారు. టాపార్డర్ దంచికొట్టడంతో అఫ్గన్ విధించిన లక్ష్యాన్ని భారత్ 41.1 ఓవర్లలోనే ఊదేసింది.

కేవలం మూడు వికెట్లు నష్టపోయి 311 పరుగులు సాధించి.. ఏడు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తద్వారా వరల్డ్ కప్ ఫైనల్ కు దూసుకువెళ్లింది. కాగా తొలి సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించి ఇంగ్లండ్ ఫైనల్లో అడుగుపెట్టింది. భారత్- ఇంగ్లండ్ మధ్య శుక్రవారం ఫైనల్ జరుగనుంది. 3

## నేను కామెంటేటర్‌గా ఎందుకు చేయను

టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని ఓ కార్యక్రమంలో క్రికెట్ కామెంట్రీ గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. కామెంటేటర్ గా చేయొచ్చు కదా అన్న



ప్రశ్నకు ధోని సమాధానం ఇచ్చాడు. గణాంకాలు పెద్దగా గుర్తుండవని, అందుకే ఆ పని చేయలేనన్నాడు. 'గణాంకాలు గుర్తుంచుకోవడం నాకు చాలా కష్టం. ఆటను వర్ణించడం, ఆటగాళ్లను విమర్శించడం మధ్య సన్నటి గీత మాత్రమే ఉంటుంది. ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా మ్యాచ్ సమయంలో వ్యాఖ్యానం చేయడం కళ' అని ధోని అన్నాడు.

'మ్యాచ్ సందర్భంగా.. ఓ టీమ్ ఓడిపోవడానికి గల కారణాలను విశ్లేషించేటప్పుడు ఎవరూ నొచ్చుకోకుండా చెప్పగలగాలి. అలాగే నా కన్నా చాలా మందికి గణాంకాలపై మంచి పట్టు ఉంది. మీరు నా గణాంకాల గురించి అడిగినా కూడా చెప్పలేను' అని ధోని పేర్కొన్నాడు.

# నేను ఎక్కువగా వాడే పదం అది

''నేను రోజూ ఎక్కువగా వాడే పదం ఐ లవ్ యు. అది కూడా నా కూతురి కోసమే'' అని అంటోంది హిందీ తార దీపికా పదుకొణె. కథల ఎంపికలో ఆచితూచి అడుగులేసే కథానాయికీమె. ప్రస్తుతం ఓవైపు తల్లిగా తన బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే.. రాబోయే ప్రాజెక్టుల కోసం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దీపిక తన కుమార్తె గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. ''ఇప్పుడు నా ప్రపంచమంతా నా కూతురు దువా చుట్టూనే తిరుగుతుంది. ఆమె నాకు అన్నింటికన్నా ఎక్కువ'' అంది. అలానే నేర్చుకోవడం అనేది రోజువారీ జీవితంలో భాగం కావాలని చెబుతోంది దీపిక. ''కెరీర్ మొదట్లో పరిశ్రమను, కళను, మాధ్యమాన్ని అర్థం చేసుకోవడంపైనే ఉండేది. ఇప్పుడు పరిశ్రమలో మరింత మెరుగ్గా ఎలా రాణించాలో ఆలోచిస్తున్నా, అందుకే నేర్చుకోవడం ఎప్పుడూ ఆగకూడదు'' అని చెప్పుకొచ్చింది దీపిక.



# రాముడిగా కనిపిస్తాను..

## 'వారణాసి'లో తన పాత్ర గురించి చెప్పిన మహేశ్

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'వారణాసి' ఒకటి. ఈ సినిమా అప్ డేట్స్ ఎప్పుడెప్పుడు వస్తాయా అని అభిమానులతో పాటు సెలబ్రిటీలు కూడా ఆసక్తిగా ఉన్నారు. తాజాగా ఈ చిత్ర బృందం ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఎన్నో విశేషాలు పంచుకుంది. ఈ సినిమాలో వారి పాత్రల దగ్గర నుంచి కథ ఎలా మొదలైంది వరకూ మహేశ్ బాబు చెప్పిన విశేషాలు మీకోసం..



**మొదట భయపడ్డాను..**

15 ఏళ్ల క్రితమే రాజమౌళి దర్శకత్వంలో చేయాల్సిఉంది. ఇప్పటికి అది కుదిరింది. 'ఆర్ఆర్ఆర్' పూర్తయిన తర్వాత ఏడాది పాటు దీని స్క్రిప్ట్ గురించి ఆలోచించారు. నన్ను ఆఫీసుకు పిలిచి 'వారణాసి' స్క్రిప్ట్ గురించి చెప్పారు. కథ విని ఆశ్చర్యపోయాను. ఇప్పటివరకూ రాజమౌళి చేసిన అన్ని చిత్రాల కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎన్నో అంశాలు ఉన్నాయి. యాక్షన్, అడ్వెంచర్, పురాణాలు, టైమ్ ట్రావెల్.. ఇలా ఎన్నో ఉన్నాయి. రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఉన్నాను. ఇందులో హీరోగా చేయడానికి మొదట్లో భయపడ్డాను. రాజమౌళి కథను వివరించిన విధానం నా భయాన్ని పోగొట్టింది.

**రెండు షాట్ల కోసం ఆరు నెలలు..**

'వారణాసి'లో లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచి ఈ పనిలోనే ఉన్నాం. గతేడాది జర్మనీ కూడా వెళ్లాం. రాజమౌళి ప్రతి చిన్న విషయాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఎన్నిసార్లు అయినా రిహార్సల్స్ చేస్తారు. నేను ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాముడు అంటేనే హుందాతనం.. ఆయనకు ప్రత్యేకమైన భంగిమ ఉంటుంది. నిలబడే విధానం దగ్గర నుంచి పాత్రలో నటించడం వరకూ ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2,3 నెలలు దానికోసమే కష్టపడ్డాం. రాజమౌళి నేను పరిగెత్తే విధానాన్ని కూడా మార్చారు. దానికోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాను. సినిమాలో రెండు షాట్ల కోసం ఇదంతా చేశాం. ఆయనకు సినిమాపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో చెప్పడానికి ఈ ఒక్క విషయం చాలు. ఎన్నో వర్క్ షాప్ లు నిర్వహించారు. యూరోపియన్ శిల్పాలు పరిశీలించారు.

**విలన్ ల పాత్రలు ఇష్టమన్నారు**

రాజమౌళి నాకు స్క్రిప్ట్ వివరించిన తర్వాత ఆయనకు నేను ఒక మెసేజ్ పెట్టా. 'మీ దర్శకత్వంలో చేయడం చాలా ఆనందంగా ఉంది. మీరు కథ వివరించిన విధానానికి ఆశ్చర్యపోయాను' అని పంపా. ఆ మెసేజ్ కు రాజమౌళి ఇచ్చిన రిప్లై తెలుసా.. 'నాకు నా సినిమాల్లో విలన్ లు అంటే చాలా ఇష్టం. ఆ పాత్రలను ప్రేమిస్తున్నాను' అని పంపారు. 'నాకు కూడా ప్రతినాయకులంటే ఇష్టమే' అని నేను కూడా సరదాగా రిప్లై పెట్టాను. ఈ సినిమా భారీస్థాయిలో విడుదలవుతుంది. ఆయన ఎప్పుడూ సాంకేతిక అంశాలను నటీనటులకు వివరించరు. ఆ కష్టమంతా తనే చూసుకుంటారు. మేం ఒక్కసారి కూడా కనీసం మానిటర్ చూడలేదు. షాట్ పూర్తవగానే మరో సన్నివేశంలోకి వెళ్లేవాళ్లం.

## రామ్‌చరణ్ 'పెద్ది' వాయిదా.. కొత్త విడుదల తేదీ ఇదే


రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న సినిమా 'పెద్ది'. మార్చి 27న బాక్సాఫీసు ముందుకు రావాల్సిన ఈ చిత్రం వాయిదా పడింది. తాజాగా కొత్త విడుదల తేదీని టీమ్ ప్రకటించింది. ఈ సినిమా ఏప్రిల్ 30న వస్తుందని తెలిపింది. ఈ మేరకు కొత్త పోస్టర్ ను అభిమానులతో పంచుకుంది.'ఉస్తాద్ భగత్సింగ్' విడుదల తేదీని ప్రకటించిన కొన్ని క్షణాల్లోనే 'పెద్ది' కొత్త రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేయడం గమనార్హం. పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న సినిమా ఇది. మార్చి 26న రానుంది. నెల వ్యవధిలోనే బాబాయ్- అబ్బాయిల సినిమాలు విడుదల కానుండటంతో అభిమానులు ఆనందంతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.



గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ డ్రామా మూవీ 'పెద్ది'. జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ నటుడు శివ రాజ్ కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హీరో- డైరెక్టర్, హీరో- హీరోయిన్ కాంబినేషన్లతోపాటు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఓ షాట్ (చరణ్ క్రికెట్ ఆడటం) సినిమాపై భారీ అంచనాలు పెంచింది.

### బుల్లెట్ సునీల్‌గా
## రాజశేఖర్

చార్మింగ్ స్టార్ శర్వానంద్ నటిస్తున్న ది మోస్ట్ ప్రెస్టీజియస్ చిత్రం 'బైకర్'పై ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఈ సినిమాను దర్శకుడు అభిలాష్ రెడ్డి కంకర డైరెక్ట్ చేస్తున్నారు. ఇక ఈ సినిమా టాలీవుడ్ లో తొలి బైక్ రేసింగ్ చిత్రంగా ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అయింది. కాగా, ఈ సినిమాలో యాంగ్రీ స్టార్ రాజశేఖర్ ఓ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన పాత్రకు సంబంధించిన గ్లింప్స్ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలో బుల్లెట్ సునీల్ అనే పాత్రలో రాజశేఖర్ నటిస్తున్నారు. ఒకప్పుడు మోటోక్రాస్ రేసర్ గా ఉన్న బుల్లెట్ సునీల్ బైక్ రేసింగ్ ఛాంపియన్ షిప్ లో ఇండియాను విజేతగా నిలిపేందుకు ఎలాంటి పాట్లు పడతాడు అనేది ఈ సినిమాలో రాజశేఖర్ పాత్రగా ఉండబోతుంది. ఈ పాత్రలో రాజశేఖర్ తన పర్ఫార్మెన్స్ తో మరోసారి ప్రేక్షకులను కట్టిపడేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక బైక్ రేసింగ్ కోసం శర్వాకు



రాజశేఖర్ ఎలాంటి ట్రైనింగ్ ఇస్తాడు అనేది మనకు ఈ సినిమాలో చూపెట్టబోతున్నారు. ఈ సినిమాలో శర్వా స్లిమ్ లుక్ తో ప్రేక్షకులను థ్రిల్ చేయబోతున్నాడు. ఈ సినిమాలో మాళవిక నాయర్ హీరోయిన్ గా నటిస్తోండగా గిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ ప్రొడ్యూస్ చేస్తున్న ఈ బైకర్ చిత్రాన్ని ఏప్రిల్ 3న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.